# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 119 | పేజీలు : 08 | బుధవారం | 06-05-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## నేడు ఢిల్లీకి వెళుతున్న రేవంత్ రెడ్డి

- మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు అనుమతులపై దృష్టి సారించనున్న సీఎం
- కాంగ్రెస్ పెద్దలను కలవనున్న రేవంత్
- కేరళలో యూడీఎఫ్ విజయం నేపథ్యంలో రేవంత్ పర్యటనకు మరింత ప్రాధాన్యత



2

## పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు
# ఏఐపై కమిటీ

- తెలంగాణ భవిష్యత్ ప్రణాళికలపై సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం
- పలు సూచనలు చేసిన రఘురాం రాజన్
- మూడు, నాలుగు నెలల్లో హైదరాబాద్ పర్యటనకు రానున్నట్లు తెలిపిన రఘురాం
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎంకు పలు సూచనలు
- పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు ఏఐపై కమిటీ వేస్తామన్న సీఎం



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు సిలబస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై కమిటీ వేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కమిటీకి అవసరమైన సూచనలు ఇవ్వాలని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్‌ను సీఎం కోరారు. ఏఐని సరైన విధానంలో వినియోగిస్తే అందరికి మేలు జరుగుతుందని రఘురాం రాజన్ పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలపై జరిగిన సమావేశంలో ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని పలు సూచనలు చేశారు.సులభతర వ్యాపార విధానాలపై
యువత నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటే అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని రఘురాం రాజన్ అన్నారు. మానవ వనరుల అభివృద్ధి కోసం పోషకాహార లోపం సమస్య తగ్గించుకోవాలని సూచించారు. కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు

## రైతును రాజు చేసేంత వరకు
# విశ్రమించం

- లక్ష రూపాయల రుణమాఫీ చేసేందుకు గత ప్రభుత్వం పదేళ్ల సమయం తీసుకుందన్న పొంగులేటి
- గతంలో వరి వేస్తే ఉరి అనే పరిస్థితి ఉండేదన్న మంత్రి
- సన్న వడ్లకు బోనస్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని వెల్లడి



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తమది రైతు పక్షపాత ప్రభుత్వం అని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. హనుమకొండలో జరిగిన 'మెగా రైతు మేళా'లో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. లక్ష రూపాయల రుణమాఫీ చేయడానికి గత ప్రభుత్వం పదేళ్ల సమయం

## హామీలకు..పనులకు
# పొంతన లేదు

- రేవంత్ ఇచ్చిన హామీలకు.. ఇప్పుడు చేస్తున్న పనులకు పొంతనలేదన్న ఈటల రాజేందర్
- ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న ఈటల
- బిల్లులు అందక కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన
- మమత అహంకారానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని వ్యాఖ్య



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు, ప్రస్తుతం ఆయన చేస్తున్న పనులకు ఏమాత్రం పొంతన లేదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. గజ్వేల్‌లో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన

## గతంలో ఓట్
# చోరీ చేసే గెలిచారా?

### తెలంగాణ బీజేపీ చీఫ్ ప్రశ్న

- ఈ నెల 10న రాష్ట్రానికి వచ్చే మోదీకి స్వాగతం పలకాలన్న బీజేపీ చీఫ్
- ఓట్ చోరీ జరిగిందని మమతా బెనర్జీ అంటే, రాహుల్ సమర్థించడం విడ్డూరమని వ్యాఖ్య
- ప్రజాస్వామ్యంలో ప్రజాతీర్పు సమర్థవంతమైనదన్న రామచందర్ రావు



2

# గెలుపు తర్వాత తొలిసారి ట్వీట్

- 7న విజయ్ ప్రమాణస్వీకారం?
- టీవీకే గెలుపు తర్వాత తొలిసారి ట్వీట్
- తమిళనాడు అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా పనిచేస్తా
- రాష్ట్ర ప్రయోజనాలే తొలి ప్రాధాన్యం
- మోదీ శుభాకాంక్షలకు ధన్యవాదాలు తెలియజేసిన విజయ్



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

తమిళనాడు అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని టీవీకే అధ్యక్షుడు విజయ్ తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలే తమ తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలకు విజయ్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రజల శ్రేయస్సు, సంక్షేమమే తన ఏకైక లక్ష్యమని తెలిపారు. రాజకీయ విభేదాలను పక్కన పెట్టి తమిళనాడు

# నేను రాజీనామా చేయను



2

- నేను సీఎం పదవికి రాజీనామా చేయను... మేం ఓడిపోలేదన్న మమతా బెనర్జీ
- బెంగాల్ ఎన్నికల ఫలితాలను తిరస్కరించిన మమతా బెనర్జీ
- 100 స్థానాలను అక్రమంగా దక్కించుకున్నారని ఆరోపణ
- ఎన్నికల అక్రమాలపై 15 మందితో ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ
- భవానీపూర్‌లో ఓడినా రాజీనామా చేయబోనని స్పష్టీకరణ
- మమతకు ఇండియా కూటమి నేతల మద్దతు

హైదరాబాద్ పల్స్,డెస్క్

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పూర్తిగా తిరస్కరించారు. తాను సీఎం పదవికి రాజీనామా చేయబోనని,

## డేటా సెంటర్లను
# మేమే నడిపిస్తాం

### మంత్రి నారా లోకేష్



2

- ఏపీని గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని మంత్రి లోకేష్
- శ్రీసిటీలో క్యారియర్ సంస్థ చిల్లర్ తయారీ ప్లాంట్‌కు బుధవారం శంకుస్థాపన
- డేటా సెంటర్లకు ఆతిథ్యం ఇవ్వడమే కాక, వాటిని నడిపించే శక్తిగా ఏపీ మారుతుందని స్పష్టం
- గూగుల్, రిలయన్స్ వంటి సంస్థల భారీ పెట్టుబడులతో ఏపీ దూసుకెళ్తోందని వెల్లడి
- దిగుమతులు తగ్గించి, ఎగుమతులు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న లోకేష్

హైదరాబాద్ పల్స్,అమరావతి

నెక్స్ట్ జనరేషన్ మాన్యుఫ్యాక్చరింగ్, డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. కేవలం డేటా సెంటర్లకు ఆతిథ్యం ఇవ్వడమే కాకుండా, వాటిని నడిపించే కీలక భాగాల తయారీ కేంద్రంగా ఏపీని మార్చడమే తమ లక్ష్యమని

## రావాల్సిన నిధుల గురించి
# మాట్లాడటం లేదు

- మోదీ పర్యటన నేపథ్యంలో బీజేపీపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన కొండా సురేఖ
- ఈ నెల 10న తెలంగాణ పర్యటనకు వస్తున్న ప్రధాని మోదీ
- రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి ఇక్కడి కేంద్ర మంత్రులు మాట్లాడటం లేదని విమర్శ
- గోదావరి పుష్కరాల కోసం రాష్ట్రానికి కేంద్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపాటు



2

## హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు
# భారీ ఆపరేషన్..

56 మంది అరెస్ట్

2

## రౌడీషీటర్ ను పట్టుకున్న ఆటోడ్రైవర్

### సన్మానించిన సజ్జనార్

- ప్రాణాలకు తెగించి రౌడీషీటర్ ను అడ్డుకున్న ఆటో డ్రైవర్
- ఆటోతో ఢీకొట్టి నిలువరించిన వైనం, సీసీటీవీలో వెలుగుచూసిన సాహసం
- ఆటోడ్రైవర్ ను నగదు, ప్రశంసాపత్రంతో సన్మానించిన సీపీ సజ్జనార్



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ఓ ఆటో డ్రైవర్ తన ప్రాణాలు సైతం లెక్క చేయకుండా చూపిన ధైర్యసాహసాలను హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ ప్రశంసించారు. మహిళ మెడలో నుంచి గోల్డ్ చైన్‌ను లాక్కుని ఉడాయించేందుకు ప్రయత్నించిన రౌడీషీటర్‌ను ఆటో డ్రైవర్

# నేడు ఢిల్లీకి వెళుతున్న రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ఉదయం ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు అవసరమైన కేంద్ర అనుమతులపై ఆయన దృష్టి సారించనున్నట్టు సమాచారం. ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయి, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు అందాల్సిన నిధులపై విజ్ఞప్తులు చేయనున్నారు. పాలనాపరమైన అంశాలతో పాటు, ఏఐసీసీ అగ్రనేతలతో కూడా ముఖ్యమంత్రి సమావేశం కాబోతున్నారు.కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సాధించిన అఖండ విజయం ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యతను చేకూర్చింది. కేరళ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించి, కూటమి విజయంలో తనవంతు కృషి చేశారు. ప్రస్తుతం కేరళ ముఖ్యమంత్రి ఎవరనే ఉత్కంఠ కొనసాగుతుండగా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు రేసులో బలంగా వినిపిస్తోంది. రేవంత్ రెడ్డికి, వేణుగోపాల్‌తో ఉన్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో, ఈ ఢిల్లీ పర్యటనలో కేరళ రాజకీయ సమీకరణాలపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది.

# హామీలకు..పనులకు పొంతన లేదు

మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ప్రయోజనాలు కల్పించడంలో, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. చివరికి న్యాయస్థానాలు జోక్యం చేసుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్థాయికి పరిస్థితి దిగజారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు అందక వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అధికారంలోకి వచ్చిన రెండేళ్లకే కాంగ్రెస్ పార్టీ ప్రజల చేత ఛీత్కరించుకునే స్థితికి చేరుకుందని ధ్వజమెత్తారు.పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ అహంకారానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని, తమిళనాడులో స్టాలిన్ వంటి బలమైన నేతపై ఒక సామాన్యుడు గెలిచాడంటే అక్కడి ప్రభుత్వాలపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతుందని విశ్లేషించారు. కుటుంబ రాజకీయాలు చేస్తూ, రాష్ట్రాన్ని తమ జాగీరుగా భావించే వారికి తమిళనాడు ఫలితాలు ఒక హెచ్చరిక అని పేర్కొన్నారు. అవినీతి సొమ్ముతో ఎన్నికల్లో గెలవాలనుకునే వారికి ఈ ఫలితాలు కనువిప్పు కావాలని... తెలంగాణ బాగుపడాలంటే బీజేపీ అధికారంలోకి రావడమే ఏకైక మార్గమని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

# డేటా సెంటర్లను మేమే నడిపిస్తాం

మొదటి పేజీ తరువాయి

ఆయన మంగళవారం స్పష్టం చేశారు.ఇందులో భాగంగా శ్రీసిటీలో క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్న చిల్లర్ తయారీ యూనిట్‌కు బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. "డేటా సెంటర్లకు కేవలం ఆతిథ్యం ఇవ్వడంతోనే ఏపీ సరిపెట్టుకోదు. వాటిని నడిపించే ఇంజిన్‌గా మారాలని మేము నిశ్చయించుకున్నాం. శ్రీసిటీలో క్యారియర్ ప్లాంట్ ఏర్పాటు మా ప్రయాణంలో ఒక చారిత్రాత్మక ఘట్టం" అని లోకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీసిటీ వంటి ప్రపంచ స్థాయి పారిశ్రామిక ప్రాంతాలు, బలమైన విధానాల మద్దతుతో ఈ లక్ష్యాన్ని సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే డేటా సెంటర్ల ఏర్పాటులో దేశంలోనే కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇటీవల విశాఖపట్నంలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏఐ డేటా సెంటర్ హబ్‌కు శంకుస్థాపన జరిగింది. దీనికి తోడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి రూ.1.6 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. మొత్తంగా సుమారు రూ.6 లక్షల కోట్ల పెట్టుబడుల పైప్‌లైన్‌తో రాష్ట్రం ముందుకు సాగుతోంది.డేటా సెంటర్ల మౌలిక సదుపాయాల నుంచి వాటికి అవసరమైన కూలింగ్ సిస్టమ్స్, పవర్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్, ఎలక్ట్రానిక్స్ వంటి భాగాల తయారీ వరకు పూర్తిస్థాయి వ్యవస్థను రాష్ట్రంలో నిర్మించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. తద్వారా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, ఎగుమతులను ప్రోత్సహించడంతో పాటు, డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తయారీలో భారతదేశాన్ని ప్రపంచ లీడర్‌గా నిలబెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వ్యూహంలో భాగంగా ఇప్పటికే శ్రీసిటీ ఏసీ, కూలింగ్ తయారీ రంగంలో రూ.12,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది.

# హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్..

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, మే 05: హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆపరేషన్ ఆక్టోపస్ 2.0తో పేరుతో భారీ ఆపరేషన్ చేపట్టి దాడులు నిర్వహించారు. తొమ్మిది రాష్ట్రాల్లో ఈ ఆపరేషన్లు నిర్వహించి.. 56 మంది నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బ్యాంక్ సిబ్బందితోపాటు పట్టుబడ్డ నిందితులకు 101 కేసులతో సంబంధం ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. అలాగే అరెస్ట్ అయిన వారిలో 32 మంది బ్యాంక్ మేనేజర్లు, కేవైసీ అప్రూవర్లు, రిలేషన్‌షిప్ మేనేజర్లతోపాటు ఫీల్డ్ ఆఫీసర్లు ఉన్నారు.అదే విధంగా15 మంది మ్యూల్ అకౌంట్ హోల్డర్లతో పాటు, 9 మంది అకౌంట్ ఆపరేటర్లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరందరికీ 101 కేసులతో సంబంధం ఉందని పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో బాధితులకు రూ. 69.99 లక్షలు రీఫండ్ చేశారు. ఈ 101 కేసుల్లో బాధితుల నుంచి రూ. 9.13 కోట్ల నగదును నిందితులు కొట్టేసినట్లు పోలీసులు గుర్తించారు.ఇక అరెస్టయిన వారిలో 17 మంది ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌కు సంబంధించిన వారని పోలీసులు వివరించారు. ట్రేడింగ్ ఫ్రాడ్‌లో 30 మంది, డిజిటల్ అరెస్ట్ కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇలా అరెస్టయిన వారిలో తెలంగాణ నుండి అత్యధికంగా 17 మంది ఉన్నారని తెలిపారు. మహారాష్ట్ర నుంచి 14, ఢిల్లీ నుంచి 9, కర్ణాటక నుంచి నలుగురు, ఏపీ నుంచి ఇద్దరు అరెస్టయ్యారని పేర్కొన్నారు.నిందితుల నుంచి 34 మొబైల్ ఫోన్లు, 8 చెక్ బుక్కులతోపాటు 11 షెల్ కంపెనీ స్టాంపులు, ట్యాబ్ సీజ్ చేశామని వివరించారు. సైబర్ పెట్రోలింగ్ ద్వారా అక్రమ బెట్టింగ్, నకిలీ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్న 184 సోషల్ మీడియా ప్రొఫైళ్లు తొలగించినట్లు పోలీసులు చెప్పారు. సి-మిత్ర ద్వారా1250 కాల్స్ చేసి బాధితులకు అవగాహన కల్పించడంతో పాటు 194 జీరో ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు తెలిపారు.గేమింగ్ ఫ్రాడ్ కేసులో బాధితురాలిని మోసం చేసి రూ. 74.99 లక్షలు మోసం చేసిన కేసులో కోల్‌కతాకు చెందిన ఇండస్‌ఇండ్ బ్యాంక్ కీ అకౌంట్ మేనేజర్ మొహమ్మద్ రియాజుద్దీన్, అసిస్టెంట్ మేనేజర్ మనీష్ ప్రసాద్ విశ్వకర్మను అరెస్ట్ చేసినట్లు సైబర్ క్రైమ్ పోలీసులు వెల్లడించారు

# నేను రాజీనామా చేయను

మొదటి పేజీ తరువాయి

తాము ఓడిపోలేదని అన్నారు. ఎన్నికల్లో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, ఇది "ప్రజాస్వామ్య హత్య" అని ఆమె తీవ్రంగా వ్యాఖ్యానించారు. తాము ఈ ఫలితాలను చట్టబద్ధమైన ఓటమిగా అంగీకరించబోమని స్పష్టం చేశారు.కోల్‌కతాలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో బీజేపీ దాదాపు 100 స్థానాలను అక్రమంగా దొంగిలించిందని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల కమిషన్, కేంద్ర బలగాలు పక్షపాతంగా వ్యవహరించాయని, దాదాపు 90 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి కుట్రపూరితంగా తొలగించారని విమర్శించారు.తన సొంత నియోజకవర్గమైన భవానీపూర్‌లోనూ ఓటమి పాలైనప్పటికీ, తాను రాజీనామా చేయబోనని మమత స్పష్టం చేశారు. తన రాజకీయ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై నిజ నిర్ధారణకు 15 మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రానికి వెళ్తున్న సమయంలో తన కారును అడ్డుకుని, తనపై భౌతిక దాడికి యత్నించారని ఆమె ఆరోపించారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు గూండాల్లా వ్యవహరించాయని మండిపడ్డారు.ఈ క్లిష్ట సమయంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అరవింద్ కేజ్రీవాల్, అఖిలేష్ యాదవ్ వంటి 'ఇండియా' కూటమి నేతలు తనకు ఫోన్ చేసి మద్దతు తెలిపారని మమత వెల్లడించారు. మొత్తం 294 స్థానాలున్న బెంగాల్ అసెంబ్లీలో బీజేపీ 207 సీట్లు గెలుచుకుని అధికారాన్ని కైవసం చేసుకోగా, టీఎంసీ 80 స్థానాలకే పరిమితమైంది. ఈ ఫలితాల రోజును బెంగాల్ రాజకీయ చరిత్రలో ఒక 'చీకటి రోజు'గా ఆమె అభివర్ణించారు.

# రైతును రాజు చేసేంత వరకు విశ్రమించం

మొదటి పేజీ తరువాయి

తీసుకుందని... కానీ తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నుంచి బయటపడేస్తూనే, రైతులకు రూ. 21 వేల కోట్ల రుణమాఫీని విజయవంతంగా పూర్తి చేసిందని గుర్తుచేశారు.గత హయాంలో 'వరి వేస్తే ఉరి' అన్న పరిస్థితులు ఉండేవని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు భరోసా కల్పిస్తూ సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వంగా నిలిచిందని చెప్పారు.రైతు సంక్షేమమే ధ్యేయంగా ఎకరానికి రూ. 12 వేల ఆర్థిక సాయంతో పాటు అత్యాధునిక వ్యవసాయ పరికరాలను రైతులకు అందజేస్తున్నామని మంత్రి తెలిపారు. వ్యవసాయ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ. 1,200 కోట్లు చెల్లించిందని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో రైతును రాజు చేసే వరకు తమ ప్రభుత్వం విశ్రమించబోదని, ప్రతి రైతుకు మద్దతు ధరతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# రావాల్సిన నిధుల గురించి మాట్లాడటం లేదు

మొదటి పేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 10న తెలంగాణ పర్యటనకు వస్తున్న సంగతి తెలిసిందే. మోదీ హైదరాబాద్ సభ కోసం బీజేపీ శ్రేణులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. మోదీ పర్యటన నేపథ్యంలో, మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నేతలు కేవలం మీటింగ్‌లు పెట్టడం, 'జై శ్రీరామ్' అనడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. అలా అనడం వల్ల పైనుంచి నిధులు పడుతున్నాయా లేదా పథకాలు వస్తున్నాయా అని ఆమె ప్రశ్నించారు. ప్రధానిని పిలిపించి హిందీలో నాలుగు మాటలు చెప్పించి పంపడం తప్ప, రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి ఇక్కడి కేంద్ర మంత్రులు కానీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కానీ మాట్లాడటం లేదని ఆమె ధ్వజమెత్తారు.ముఖ్యంగా గోదావరి పుష్కరాల కోసం ఆంధ్రప్రదేశ్‌కు కోట్లాది రూపాయలు విడుదల చేసిన కేంద్రం, తెలంగాణకు మాత్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆమె ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం రేవంత్ రెడ్డి గారు రూ. 4,200 కోట్లు కేటాయించారని చెప్పారు. తెలంగాణపై బీజేపీకి ఏ మాత్రం ప్రేమ లేదని మండిపడ్డారు. అదేవిధంగా, బీఆర్ఎస్ పార్టీపై కూడా మంత్రి కొండా సురేఖ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ కళ్లు ఉండి చూడలేని, చెవులు ఉండి వినలేని పార్టీ అని మండిపడ్డారు. గత పదేళ్లలో రైతులను పట్టించుకోని వారు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం తెచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు బీఆర్ఎస్ మద్దతు పలికిందని విమర్శించారు.

# పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు ఏఐపై

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వాల సులభతర వ్యాపార విధానాలపై ఆధారపడి ఉంటాయని రఘురాం రాజన్ అన్నారు. స్టార్టప్‌లను ప్రోత్సహిస్తే మరింత ఉపయోగం ఉంటుందన్నారు.

డేటా సెంటర్‌లకు విద్యుత్, నీరు ఎక్కువ

తమిళనాడు తరహా పారిశ్రామిక విధానం ఉంటే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించవచ్చునని రఘురాం రాజన్ తెలంగాణ ప్రభుత్వానికి సూచించారు. డేటా సెంటర్లకు విద్యుత్, నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందని ఆర్బీఐ మాజీ గవర్నర్ అభిప్రాయపడ్డారు. మూడు నాలుగు నెలల్లో హైదరాబాద్ పర్యటనకు రానున్నట్లు రాజన్ తెలిపారు. మిడిల్ లెవల్ ఉద్యోగాల కల్పన కోసం స్కిల్స్ యూనివర్సిటీ, ఏటీసీలను అభివృద్ధి చేస్తున్నట్లు రఘురాం రాజన్‌కు సీఎం వివరించారు.

ఇండస్ట్రీలకు అన్ని సదుపాయాలు ఉన్నాయి

రాష్ట్రంలో పరిశ్రమలకు అవసరమైన అన్ని సదపాయాలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో సులభతర వ్యాపారానికి అనువైన పరిస్థితులు ఉన్నాయని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సమావేశంలో సీఎస్ రామక్రిష్ణారావు, ఉన్నతాధికారులు శేషాద్రి, అజిత్ రెడ్డి, జయేష్ రంజన్, వాణీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐని ఏకీకృతం చేయడంపై సాయం

పాఠశాల, ఉన్నత, సాంకేతిక, వైద్య విద్య పాఠ్యాంశాలలో ఏఐని ఏకీకృతం చేయడంపై సిఫార్సులు అందించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయడంలో సహాయపడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్‌ను కోరారు. మధ్యస్థాయి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రాష్ట్రంలో స్కిల్స్ యూనివర్సిటీ, అధునాతన శిక్షణా కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు.

# గతంలో ఓట్ చోరీ చేసే గెలిచారా?

మొదటి పేజీ తరువాయి

మమతా బెనర్జీ, రాహుల్ గాంధీలు గతంలో ఓట్ చోరీ చేసే ఎన్నికల్లో గెలిచారా? అని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు ప్రశ్నించారు. ఈరోజు హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ, యావత్ ప్రపంచం ఆర్థికమాంద్యంలో కొట్టుమిట్టాడుతుంటే మోదీ ఆధ్వర్యంలో భారతదేశం ప్రగతి పథంపై పరుగులు పెడుతోందని అన్నారు. ఈ నెల 10వ తేదీన రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీకి ప్రజలు ఘన స్వాగతం పలకాలని కోరారు.బెంగాల్‌లో 100 సీట్లలో ఓటు చోరీ జరిగిందని మమతా బెనర్జీ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. వీళ్లకు ఓటు చోరీ అలవాటు కాబట్టే అప్పుడు గెలిచారని చురక అంటించారు. ఎన్నికల్లో ఓడిపోతే ప్రజల తీర్పును అంగీకరించాలని, కానీ ప్రజలను అవమానపరిచే మాటలు సరికాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పు సర్వశక్తిమంతమైనదని అన్నారు.ప్రజాతీర్పును మమతా బెనర్జీ అవమానిస్తుంటే కాంగ్రెస్ మద్దతు తెలపడం విడ్డూరమని మండిపడ్డారు. మూడుసార్లు మమతా బెనర్జీ గెలిచినప్పుడు తాము ఏమీ అనలేదని, ప్రజాతీర్పును గౌరవించామని అన్నారు. కానీ వాళ్లు ఓడిపోతే మాత్రం ఈవీఎంలను తప్పుబడుతున్నారని మండిపడ్డారు. ఈసీఐని, దేశాన్ని నిందించడం ఏమిటని రామచందర్ రావు ప్రశ్నించారు.

# రౌడీషీటర్ ను పట్టుకున్న ఆటోడ్రైవర్

మొదటి పేజీ తరువాయి

పట్టుకుని సాహసం ప్రదర్శించాడు. హైదరాబాద్‌లోని బేగంబజార్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

**ప్రాణాలకు తెగించి ఆటో డ్రైవర్ సాహసం**

వివరాల్లోకి వెళితే బేగంబజార్ జిన్సీ చౌరాహ్ ప్రాంతంలో ఓ మహిళ తన కోడలితో కలిసి ఉదయపునడక(మార్నింగ్ వాక్‌కు) వెళ్లారు. ఈ క్రమంలోనే డబీర్‌పురా ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ మహ్మద్ సోహేల్ ఆమె మెడలోని గోల్డ్‌చైన్‌ను లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ క్రమంలోనే దొంగ స్కూటీ అదుపుతప్పి కిందపడబోయాడు. అప్పటికే అప్రమత్తమైన బాధితురాలు ఒక్కసారిగా గట్టిగా కేకలు వేయడంతో అదే సమయంలో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ గమనించారు.వెంటనే ఆటోను వెనక్కి తిప్పి వాహనంపై నుంచి లేచి అక్కడి నుంచి ఉడాయించేందుకు ప్రయత్నించిన రౌడీషీటర్‌ను తన ఆటోతో ఢీకొట్టాడు. ఈ క్రమంలోనే నిందితుడు ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడికి దిగాడు. అయినప్పటికీ లెక్క చేయకుండా ఆటో డ్రైవర్ రౌడీషీటర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. కాగా సీసీటీవీ కెమేరాల్లో ఘటనా దృశ్యాలు నమోదయ్యాయి. సీపీ సజ్జనార్ ఆటో డ్రైవర్ జుహెర్‌ను సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు.

**జాహెర్ సమాజానికి ఓ రోల్ మోడల్**

ఈ సందర్భంగా సీపీ శ్రీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ చూపిన సాహసం సమాజానికి ఆదర్శమన్నారు. "చూస్తుండగానే నేరాలు జరుగుతున్నా పట్టించుకోని ఈ రోజుల్లో, ప్రాణాలకు తెగించి మరీ రౌడీ షీటర్ ను అడ్డుకున్న జాహెర్ సమాజానికి నిజమైన రోల్ మోడల్. ఆయనలో ఒక అద్భుతమైన ప్రజా పోలీస్ ఉన్నారు. ఎలాంటి ప్రతిఫలం కూడా ఆశించలేదు. ఇలాంటి బాధ్యతాయుతమైన పౌరులు ఉన్నప్పుడే నేరస్తులకు భయం పుడుతుంది" అని ప్రశంసించారు. జాహెర్‌కు ప్రశంసా పత్రంతో పాటు నగదు పురస్కారాన్ని అందజేశారు. నేరం జరుగుతున్నప్పుడు భయపడకుండా, మహమ్మద్ జాహెర్ వలె ధైర్యంతో స్పందించి వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని నగరవాసులకు ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ పిలుపునిచ్చారు.

# గెలుపు తర్వాత తొలిసారి ట్వీట్

మొదటి పేజీ తరువాయి



ప్రగతిపైనే దృష్టి సారిస్తామని ఆయన ఉద్ఘాటించారు. తమిళనాడు అభివృద్ధికి కేంద్ర సహకారం కావాలని విజయ్ కోరారు. అదేవిధంగా, గురువారం తమిళనాడు సీఎంగా విజయ్ ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చెన్నై నెహ్రూ స్టేడియంలో ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇందుకోసం బుధవారం గవర్నర్‌ను విజయ్ కలిసే అవకాశం ఉందని టీవీకే వర్గాలు అంటున్నాయి.

'ప్రజల సమస్యల పరిష్కారానికై కేంద్రం ఎప్పుడూ ముందుంటుంది'

మరోవైపు, తమిళనాడు ఎన్నికల్లో టీవీకే విజయంపై ప్రధాని మోదీ కూడా స్పందించారు. తమిళనాడు ప్రజలు ఎన్‌డీఏకు ఇచ్చిన మద్దతుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం, వారి జీవన ప్రమాణాల మెరుగుదల కోసం కేంద్రం ఎప్పటికీ ముందుంటుందని చెప్పారు. అదే సమయంలో ఎన్నికల ఫలితాల్లో టీవీకే అద్భుత ప్రదర్శనకు విజయ్‌ను అభినందించారు. తమిళనాడు అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

ఇక, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా విజయ్‌కు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. దీనిపై స్పందించిన విజయ్, రాహుల్ గాంధీకి ధన్యవాదాలు తెలిపారు. ప్రజాసేవలో మంచి విజయాలను సాధించడమే తమ లక్ష్యమని చెప్పారు. తమిళ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు.

రాజకీయాలకు అతీతంగా ప్రజల సంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా, ఎన్నికల ఫలితాల అనంతరం విజయ్ చెన్నైలోని తన పార్టీ కార్యాలయంలో గెలిచిన ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఆ భేటీలో వివిధ అంశాలపై చర్చించుకున్నట్లు సమాచారం. అనంతరం ఆయన నివాసానికి చేరుకున్నారు. అలాగే, తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియలో భాగంగా రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌ను కలిసేందుకు సమయం కోరినట్లు టీవీకే వర్గాలు వెల్లడించాయి.

మెజారిటీకి ఇంకా 10 స్థానాలు అవసరం

తమిళనాడు రాజకీయాల్లో తొలి సారిగా ఎన్నికల బరిలోకి దిగిన టీవీకే, 234 అసెంబ్లీ స్థానాల్లో 108 స్థానాలు గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావాల్సిన మెజారిటీకి ఇంకా 10 స్థానాలు తక్కువగా ఉన్నాయి. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మద్దతు కోసం ఇతర రాజకీయ పార్టీల నేతలతో చర్చలు జరుపుతున్నట్లు టీవీకే వర్గాలు తెలిపాయి.కాగా, సోమవారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో డీఎంకేకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కంచుకోటగా భావించే కొళత్తూర్ నియోజకవర్గంలో ఓటమి పాలయ్యారు. ఆయనకు పోటీగా దిగిన టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు స్టాలిన్‌పై 8,795 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అయితే, ఈ ఫలితం తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామంగా భావిస్తున్నారు. అలాగే, దశాబ్దాలుగా తమిళనాడు రాజకీయాలను డీఎంకే, ఏఐఏడీఎంకే కూటములే ఆధిపత్యం చలాయిస్తున్నాయి. అయితే తాజా ఎన్నికల ఫలితాలు ఆ రాజకీయ సమీకరణాల్లో మార్పుకు సంకేతాలిచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో సినీ నటుడు విజయ్ భారీ మెజారిటీతో విజయం సాధించడం రాష్ట్ర రాజకీయాల్లో నూతన అధ్యయనం సృష్టించింది.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, భద్రాద్రి కొత్తగూడెం :**
చర్ల మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం విస్తృత పర్యటన నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించి వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు.సత్యనారాయణపురం గ్రామంలోని పెద్దపల్లి, ముమ్మిడివరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఇప్పటివరకు వచ్చిన ధాన్యం పరిమాణం, కొనుగోలు ప్రక్రియ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం నష్టపోకుండా రక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ట్యాబ్ ఎంట్రీలను ఆలస్యం లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు.అనంతరం సత్యనారాయణపురం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. కాకర్లపూడి. విజయలక్ష్మి, పూర్తి చేసిన ఇల్లు, చినిగిరి. రాజు రూఫ్ స్థాయిలో ఉన్న ఇల్లు, కారం. నాగరాజు స్లాబ్ దశలో ఉన్న ఇల్లు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, పునాది నుంచి స్లాబ్ వరకు ప్రతి దశలో ఇంజనీరింగ్ ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని అధికారులకు ఆదేశించారు.నిర్మాణ పనుల పురోగతి, నాణ్యతపై సమీక్ష నిర్వహిస్తూ లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సిమెంట్, ఇసుక, ఇనుము వంటి నిర్మాణ సామగ్రి నాణ్యంగా ఉండేలా చూడాలని, పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. గ్రామంలో మంజూరైన 27 ఇళ్లలో 25 ఇళ్లు వివిధ దశల్లో కొనసాగుతుండగా, మిగిలిన ఇళ్లకు గ్రౌండింగ్ వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ప్రభుత్వం పేదలకు నాణ్యమైన గృహ వసతి కల్పించడమే లక్ష్యమని, పనులు నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలను సమగ్రంగా పరిశీలించారు. మేటర్నిటీ వార్డు, డయాలసిస్ కేంద్రం, మందుల నిల్వ గది, వంటగది, అవుట్ పేషెంట్ విభాగం తదితర విభాగాలను సందర్శించి సేవల నాణ్యతను తనిఖీ చేశారు.ఓపీ విభాగంలో చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకుని సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మందుల నిల్వలను పరిశీలించి అవసరమైన ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా స్టాక్ నిర్వహణను క్రమబద్ధీకరించాలని సూచించారు. రోగులకు అందించే ఆహారం నాణ్యతపై దృష్టి సారిస్తూ శుభ్రతతో కూడిన పోషకాహారం అందించాలన్నారు.ఆసుపత్రి ఆవరణలో 108 అంబులెన్స్ సిబ్బందితో మాట్లాడి అత్యవసర సేవల నిర్వహణపై వివరాలు తెలుసుకుని, సమయానికి



స్పందిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రిలో త్రాగునీటి కొరత ఉన్నట్లు గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి నిరంతర నీటి సరఫరా కల్పించాలని ఆదేశించారు. ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు, శుభ్రత, మౌలిక సదుపాయాలు అందేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఈదయ్య, గృహ నిర్మాణ శాఖ ఏ ఈ ముకేశ్ ,ఏ ఓ లావణ్య, మిషన్ భగీరథ ఏఈ లు అరుణ్,రాము, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపర్డెంట్ డాక్టర్ సాయి వర్ధన్, డాక్టర్లు రాంప్రసాద్, రవికుమార్, తిరుపతిరావు, జాన్ ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్నేహితుడి దారుణ హత్య.. మిస్టరీని ఛేదించిన భువనగిరి పోలీసులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మద్యం తాగిపించి ప్రాణ స్నేహితుడిని హత్య చేసి, ఆధారాలు దొరకకుండా శవాన్ని తగలబెట్టిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎలాంటి క్లూ లేని ఈ ఉదంతాన్ని భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. మంగళవారం నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

**పాత కక్షలే కారణం...**
పోలీసుల కథనం ప్రకారం.. ఆల్వాల్ పరిధిలోని జొన్నబండకు చెందిన పొన్నకంటి కాశి అలియాస్ ప్రభ (23) గార్బేజ్ కలెక్షన్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి పొన్నకంటి శేఖర్ అనే మిత్రుడు ఉండేవాడు. గతంలో వీరిద్దరూ కలిసి ఒక స్క్రాప్ షాపులో రాగి తీగ దొంగతనం చేశారు. ఆ సమయంలో యజమాని శేఖర్‌ను పట్టుకోగా, అతను కాశి పేరు బయటపెట్టాడు. ఈ వివాదంలో కాశి నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చింది. తన పేరు చెప్పి అవమానపరిచాడనే కక్షతో శేఖర్‌ను హతమార్చాలని కాశి నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో మార్చి 30వ తేదీన శేఖర్‌ను బైక్‌పై ఎక్కించుకున్న కాశి, బొల్లారం దగ్గర మద్యం తాగించాడు. మార్గమధ్యలో పెట్రోల్ బంకులో బాటిల్‌లో



పెట్రోల్ కొట్టాడు. బైక్ మైలేజ్ రావడం లేదని శేఖర్‌ను నమ్మించాడు.


**వెంట తెచ్చిన పెట్రోల్‌తో..**
అక్కడి నుంచి షామీర్‌పేట్, కీసర మీదుగా భువనగిరి శివార్లలోని వడపర్తి, మర్యాల ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ నిర్మానుష్య ప్రదేశంలో మరోసారి మద్యం తాగించారు. శేఖర్ మత్తులో కింద పడిపోగానే గొంతు నులిమి హత్య చేశాడు. వెంట తెచ్చిన పెట్రోల్‌తో శవాన్ని తగలబెట్టి, మృతుడి ఫోన్‌ను ధ్వంసం చేసి పారిపోయాడు. రెండు రోజుల తరువాత మృతదేహాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులకు మృతదేహం పూర్తిగా కాలిపోవడంతో గుర్తు పట్టడం కష్టంగా మారింది. భువనగిరి డీఎస్పీ బి. రవీందర్, రూరల్ సీఐ ఎన్. చంద్రబాబు, బొమ్మలరామారం ఎస్సై బి. శ్రీశైలం బృందం సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడిన భువనగిరి రూరల్ సీఐ..
సంఘటనా స్థలంలో అసలు ఎలాంటి ఆధారాలు దొరకకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా నమోదైన మిస్సింగ్ కేసులను విశ్లేషించారు. సెల్ టవర్ లొకేషన్లు, మొబైల్ డేటా ఆధారంగా నిందితుడి కదలికలను గుర్తించారు. సీసీటీవీ ఫుటేజీల సాయంతో నిందితుడిని ఖరారు చేసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఆల్వాల్ శివనగర్ కాలనీలో కాశిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి హత్యకు వాడిన యాక్టివా బైక్, మృతుడి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. క్లిష్టమైన కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ప్రత్యేకంగా అభినందించారు.

# హనుమాన్ మాలాధారణ భక్తులకు అన్న ప్రసాద వితరణ

## మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రానికి చెందిన మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్ మంగళవారం హనుమాన్ మాల ధారణ భక్తులకు అన్న ప్రసాద వితరణ బిక్ష కార్యక్రమం చేపట్టారు. రాజపేట లోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ పూజలు నిర్వహించగా ఈ కార్యక్రమం జరిగింది. మొదటగా ఆలయంలోని ప్రతిష్ట మూర్తికి చందన కార్యక్రమం, ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకాలు సంధిల భాస్కర్ గౌడ్ వాణి దంపతులు నిర్వహించారు. హనుమాన్ మాల ధారణ భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారిని కీర్తిస్తూ భజనలు భక్తి పాటలు పాడారు, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది, అనంతరం శ్రీ స్వామివారికి మహా నైవేద్యం సమర్పణ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులను చేనేత శాలువాలతో సత్కరించారు. అనంతరం సామూహిక అన్న ప్రసాద వితరణ భిక్షా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం సందుల రామ్ చందర్ గౌడ్ వారి కుటుంబ సభ్యులు నిర్వహించగా రాజపేట సర్పంచ్ కోయ మధు, రఘునాథపురం సర్పంచి పల్లె సంతోష్ గౌడ్, సింగారం సర్పంచ్, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నర్సింలు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, బిఆర్ఎస్ నాయకులు జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్, చెల్మిడి వెంకటేష్, రేగు సిద్ధులు, జర్నలిస్టు ఠాగూర్ హిమ్మత్ సింగ్, తదితరులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ వేద ఆశీర్వచనం చేసి తీర్థ



ప్రసాదాలు అందజేశారు. సంధిల భాస్కర్ గౌడ్ వాణి దంపతులు హనుమాన్ మాల ధారణ భక్తుల నుండి ఆశీర్వాదం పొందారు.

# లారీలను వెంటనే ఖాళీ చేయాలి: అదనపు కలెక్టర్ కే వెంక రెడ్డి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, యాదాద్రి భువనగిరి ప్రతినిధి:**
రామన్నపేట మండలంలోని రైస్ మిల్లుల వద్ద లారీల నిల్వలు లేకుండా వెంటనే ఖాళీ చేసి సెంటర్లకు పంపించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే వెంక రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో ఉన్న విద్యా ఆగ్రో రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు.మిల్లులో నిల్వగా ఉన్న లారీలను వెంటవెంటనే ఖాళీ చేయించి తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపాలని యాజమాన్యానికి సూచించారు. జనంపల్లి గ్రామంలోని సాయి శ్రీ రైస్ మిల్లును కూడా సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.మిల్లుల వద్ద సరిపడా హమాలీలు, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో లారీల నిల్వలు పెరుగుతున్నాయని గమనించిన అదనపు కలెక్టర్, వెంటనే కార్మికులను పెంపొందించి తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ధాన్యం దిగుమతులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డిఎం సివిఎస్ హరికృష్ణ, డీసీ ఎస్ ఓ ఏ.రోజా, తహసీల్దార్ లాల్ బహదూర్, డీటీసీయస్ బాలమణి, కె. సురేష్ రెడ్డి, ఆర్ఐ శోభ, జీపీఓలు తదితరులు పాల్గొన్నారు.



# కోహీర్ లో భారీ చోరీ..

## గోదాం నుంచి గ్యాస్ సిలిండర్లు ఎత్తుకెళ్లిన దొంగలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, కోహీర్:**
కోహీర్ పట్టణ శివారులోని ఇండియన్ గ్యాస్ గోదాంలో సోమవారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. దొంగలు గోదాం డోర్ తాళం పగులగొట్టి లోపలికి చొరబడి గ్యాస్ సిలిండర్లను ఎత్తుకెళ్లారు. 51 నిండు సిలిండర్లు, 31 ఖాళీ సిలిండర్లను ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకులు తెలిపారు. దొంగిలించబడిన సిలిండర్ల ఖరీదు సుమారు రూ.2.5 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు. ఎప్పటిలాగే గోదాం ఇంచార్జి సోమవారం సాయంత్రం గోదాంకు తాళం వేసి ఇంటికి వెళ్ళిపోయాడు. ఉదయం డెలివరీ బాయ్ వచ్చి చూసేసరికి గోదాం తలుపులు తెరిచి ఉన్నాయి. గోదాం ఇంచార్జి తెరిచాడేమోనని లోపలికి వెళ్లి చూసే సరికి అక్కడ ఎవరూ కనిపించలేదు. అనుమానస్పద స్థితిలో చోరీ జరిగినట్లు భావించినా డెలివరీ బాయ్ విషయాన్ని గోదాం ఇంచార్జ్ తో పాటు నిర్వాహకులకు తెలిపారు. నిర్వహకుల ఫిర్యాదు మేరకు సీఐ శివలింగం, ఎస్సై నరేష్ సిబ్బందితో గోదాంను సందర్శించి, వివరాలు తెలుసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# బోధి పాఠశాల ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించిన సి.ఐ శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, నారాయణఖేడ్ :**
మంగళవారం నాడు నారాయణఖేడ్ మండలం అంత్వార్ గ్రామ శివారులోని బోధి పాఠశాల ఆధ్వర్యంలో ప్రధాన రహదారి దగ్గర చలివేంద్రం ప్రారంభించడం జరిగింది. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని రహదారి వెంట వెళ్తున్న వారికీ నీటి విషయంలో ఇబ్బంది ఉండకూడదని నీటి సదుపాయం కల్పించడం జరిగింది. ఈ యొక్క ప్రారంభానికి ముఖ్య అతిథిగా నారాయణఖేడ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, విజయకుమార్ లక్ష్మణ్ సాగర్, ఈశ్వర్ గౌడ్ మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

## 226 మంది లబ్ధిదారులకు రెండు కోట్ల 26 లక్షల రూపాయలు



**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05 :**
అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల అందిస్తూ పూర్తి పారదర్శక పాలన అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.మంగళవారం పటాన్చెరు లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. రామచంద్రాపురం, పటాన్చెరు, అమీన్పూర్ రెవెన్యూ మండలాల పరిధిలోని 226 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు ఆడపిల్ల పెళ్లి భారం కాకూడదన్న సమన్నత లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ అని విప్లవాత్మక పథకాన్ని పెట్టారని గుర్తు చేశారు. పటాన్చెరు నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల ఆర్థిక అభ్యున్నతికి పాటుపడుతున్నట్లు తెలిపారు.. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పీక్లతండా పాత్రికేయుడి కుమారుడి టేళ్కో విందుకు బంజారా నాయకుల హాజరు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం పీక్లతండాకు చెందిన పాత్రికేయుడు చౌహన్ రమేశ్వర్ ప్రథమ కుమారుడి టేళ్కో విందు వేడుక మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంజారా జేఏసీ, ఏఐబీఎస్ఎస్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు హాజరై నవ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా బంజారా సమాజ పెద్దలు సామాజిక కార్యకలాపాలపై చర్చించారు. బంజారా వివాహ వేడుకల్లో అనవసర వ్యయాన్ని తగ్గించి ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు బానోత్ రామారావ్, రాథోడ్ రవీందర్, చౌహన్ రాంకిషన్, చౌహన్ బాపూరావ్, జాదవ్ రమేష్, చౌహన్ రవీందర్, నూణావత్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు


## సిర్పూర్ (టి)లో జనగణన - 2027 నమోదు

### పాత్రికేయులు, మీసేవ యజమానులు పాల్గొనడం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05,** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) పట్టణంలో జనగణన--2027లో భాగంగా నిర్వహిస్తున్న సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియలో పాత్రికేయులు, మీసేవ కేంద్రాల యజమానులు పాల్గొని తమ కుటుంబ వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఈ ప్రక్రియలో పాల్గొని వివరాలు నమోదు చేసుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీఎస్ఓ జై భాస్కర్, సెన్సస్ టెక్నికల్ అసిస్టెంట్ మనీషా పాల్గొన్నారు.

## వరి ధాన్యాన్ని కుప్పపోస్తుండగా రైతు మృతి




**హైదరాబాద్ పల్స్, మే 05 శంకరపట్నం :** ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కుప్ప పోస్తుండగా కుప్పకూలి రైతు మృతి చెందాడు. శంకరపట్నం మండలం గద్దపాక సర్పంచ్ కొయ్యడ పరుశురాములు తండ్రి కొయ్యడ ఐలయ్య బుధవారం సాయంత్రం మబ్బులు కమ్మడంతో వరి ధాన్యాన్ని కుప్పలు పోస్తుండడం తో ఒక్కసారిగా కుప్పకూలినట్లు స్థానిక రైతులు తెలిపారు. గమనించిన రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గమనించిన వైద్యులు గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు

## రోడ్లపై ధాన్యం ఆరబోస్తున్న రైతులకు నోటీసులు



**హైదరాబాద్ పల్స్, మే 05, శంకరపట్నం :**
శంకరపట్నం మండలం కేశవపట్నం ఎస్సై శేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఎలాంటి అనుమతులు లేకుండా ప్రధాన రహదారిపై వరి ధాన్యం ఆరబెడుతున్న పలువురు రైతులకు నోటీసులు జారీ చేశారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల ప్రమాదాలతో కొందరు మృత్యువాత పడగా మరికొందరు చికిత్స పొంది కోరుకుంటున్నారన్నారు. రైతులు కల్లాలు, ఐకెపీ సెంటర్లను ఉపయోగించుకోవాలని ఎస్సై సూచించారు. నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 10వ తరగతి ఫలితాలపై సమీక్ష : జిల్లా విద్యాశాఖాధికారి నాగలక్ష్మి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** ఏప్రిల్ 29న వెలువడిన 10వ తరగతి పరీక్షా ఫలితాలపై జిల్లా విద్యాశాఖాధికారి శ్రీమతి బి. నాగలక్ష్మి సమీక్ష నిర్వహించారు. ఈ సంవత్సరం 12727 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా11506 ఉత్తర్ణత సాధించి 90.58% సాంధించారు. తక్కువ శాతం ఉత్తీర్ణత ప్రధానోపాద్యాయుల నుండి వివరణలు తీసుకున్నారు. జిల్లాలో తెలుగు సబ్జెకు లో ఫెయిల్ అయ్యారని సంబంధిత ప్రదానాపాధ్యాయుల నుండి వివరణలు తీసుకున్నారు. వచ్చే సంవత్సరం నుండి ఒక ప్రణాళిక ప్రకారం సబ్జెకూ బోదిస్తూ 100% ఉత్తీర్ణత సాధించాలన్నారు. పదవ తరగతి ఫైయిల్ అయిన విద్యార్థులకు రెమిడియల్ తరగతులు పాఠశాలల్లో నిర్వహించి విద్యార్థులు లందరూ జూన్ లో జరిగే సప్లిమెంటరీ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. అదేవిధంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మే 11 నుండి పిఎం శ్రీ పాఠశాలలో సమ్మర్ క్యాంప్స్ , అదేవిధంగా 12 నుండి ఎస్ ఎస్సీ రెమిడియల్ క్యాంప్స్ , 14న జయశంకర్ బడిబాట 15 న వైబ్రరీ డి. 16న ఆర్స్. క్రాఫ్ట్స్ ఢ కల్చరల్ డే పాఠశాలలో నిర్వ హించాలన్నారు. జిల్లాలో టాప్ టెన్ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ యస్ శంభుప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్. యస్. మాధవరావు మండల విద్యాశాఖధికారులు, ప్రధానో పాధ్యాయులు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

## బొల్లారంలో అనాధలైన ముగ్గురు ఆడపిల్లలకు అండగా నిలిచిన కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి



**బొల్లారం, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05 :**
బొల్లారం జీహెచ్ఎంసీ 272 డివిజన్ పరిధిలోని మల్లన్న బస్తీలో విషాదం నెలకొంది. గత 30 ఏళ్ల క్రితం పాలమూరు నుండి వలస వచ్చి ఇక్కడే స్థిరపడిన సవరయ్య (70) నిన్న అర్ధరాత్రి కనుమూశారు. ఆయన మృతితో ముగ్గురు ఆడపిల్లలు ఒక్కసారిగా అనాధలయ్యారు. సవరయ్య భార్య గతంలోనే మరణించగా, ఆయన ఏకైక కుమార్తె కూడా మనస్థితి సరిగా లేక తన ముగ్గురు ఆడపిల్లలను వదిలి వెళ్ళిపోయింది. అప్పటి నుండి ఆ ముగ్గురు మనవరాళ్లను సవరయ్యే రెక్కల కష్టంపై పెంచి పెద్దచేశారు. వృద్ధాప్యంలో కూడా వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న సవరయ్య మరణించడంతో, ఆ కుటుంబం కనీసం అంత్యక్రియలు నిర్వహించుకోలేని దయనీయ స్థితిలో పడిపోయింది. విషయం తెలుసుకున్న బొల్లారం బిజెపి పట్టణ అధ్యక్షుడు, సామాజిక సేవకుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి తక్షణమే స్పందించారు. బాధితుల ఇంటికి వెళ్లి సవరయ్య మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి పరిస్థితిని చూసి చలించిన ఆనంద్ కృష్ణారెడ్డి, తక్షణ సహాయంగా 10,000 రూపాయల ఆర్థిక సాయాన్ని అంత్యక్రియల నిమిత్తం అందజేశారు.ఈ సందర్భంగా కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న మనిషిని ఆదుకోవడమే మానవత్వం. ఆపదలో ఉన్నప్పుడు వారు ఏ కులం, ఏ మతం అని చూడకుండా సహాయం చేయడమే నా లక్ష్యం. ఈ ముగ్గురు ఆడపిల్లలకు నా వంతు అండగా ఉంటాను అని హామీ ఇచ్చారు. ఆపద సమయంలో దేవుడిలా వచ్చి ఆదుకున్న ఆనంద్ కృష్ణారెడ్డికి స్థానికులు మరియు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయన ఎల్లప్పుడూ నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని దీవించారు.

## జోగ్యతండా అభివృద్ధి పనులకు శ్రీకారం : ఎమ్మెల్యే రామచంద్ర నాయక్



**హైదరాబాద్ పల్స్, మే 05, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
డోర్నకల్ నియోజకవర్గంలోని జోగ్యతండా గ్రామంలో అభివృద్ధి దిశగా మరో కీలక అడుగు పడింది. గ్రామంలో చేపట్టబోయే పలు మౌలిక వసతుల పనులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ శంకుస్థాపన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ డాక్టర్ చందవత్ రమేష్ నాయక్ గ్రామ అవసరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రహదారుల మెరుగుదల, డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధి, తాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, పాఠశాల మౌలిక వసతులపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. గ్రామ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చే దిశగా పలు ప్రతిపాదనలు సమర్పించారు. గ్రామ అభివృద్ధి పట్ల సర్పంచ్ చొరవను ఎమ్మెల్యే అభినందిస్తూ, జోగ్యతండాను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. అభివృద్ధి పనులు వేగంగా పూర్తి కావాలంటే అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించిన ఎమ్మెల్యే, ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, మార్కెట్ డైరెక్టర్ సాధనాల వెంకటేశ్వర్లు, డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి తదితరులు, పలు గ్రామాల సర్పంచులు, నాయకులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మానవ హక్కుల షార్ట్ ఫిల్మ్ పోటీకి జూన్ 30 లోపు దరఖాస్తు చేసుకోండి

### జిల్లా కలెక్టర్ హరిత




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జాతీయ మానవ హక్కుల కమిషన్ నిర్వహిస్తున్న 2026 షార్ట్ ఫిల్మ్ పోటీలో పాల్గొనేందుకు కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాసులు జూన్ 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హరిత విజ్ఞప్తి చేశారు. వయసుతో సంబంధం లేకుండా ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చు.పోటీలో ప్రథమ బహుమతి 2 లక్షలు, ద్వితీయ బహుమతి 1.50 లక్షలు, తృతీయ బహుమతి 1 లక్ష అందించనున్నారు. పాల్గొనేవారు తమ ఎంట్రీలను Google Drive లింక్ ద్వారా hhrcshort-film@gmail.com కు పంపాలి.

## ఔట్సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

### తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ జేఏసీ కమిటీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్సీ దండే విఠల్ నివాసంలో తెలంగాణ రాష్ట్ర అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల (జె ఎ సి) కమిటీ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కార్యవర్గ నాయకులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సి.హెచ్. రామచందర్ అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మరియు ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలని కోరుతూ అదేవిధంగా ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కుమురం భీం ఆసిఫాబాద్ వివిధ శాఖలకు చెందిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్సీ దండే విఠల్ సానుకూలంగా స్పందిస్తూ, ఇది రాష్ట్రవ్యాప్త సమస్య అని, దీని పరిష్కారానికి ప్రభుత్వం వద్ద గట్టిగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సి.హెచ్. రామచందర్, ప్రధాన కార్యదర్శి పోలోజు సంతోష్ కుమార్, కోశాధికారి సుఖ్‌దేవ్, ఉపాధ్యక్షులు అంకుష్, సత్యనారాయణ ముఖ్య సలహాదారు డోంగ్రే రమేష్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బొడ్డు సాగర్, రేగుల నవీన్ మరియు వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఉద్యానవన శాఖ సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం రోజు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హార్టికల్చర్ (ఉద్యానవన శాఖ) పై నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ... జిల్లాలో ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా రైతులకు అధిక లాభాలు చేకూరుతాయని, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి రైతుకూ చేరేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు, యాదాద్రి భువనగిరి. డిహెచ్ఎస్ఓ మాధవి, ప్రజా ప్రతినిధులు మరియు ఉద్యానవన శాఖాధికారులతో కలిసి ప్రస్తుత ప్రగతిని, భవిష్యత్ కార్యాచరణను చర్చించారు. నియోజకవర్గాల వారీగా రైతులకు అవసరమైన సబ్సిడీలు, విత్తనాలు మరియు డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు మరియు ఇతర మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, రైతులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన డి.ఎం.హెచ్.ఓ డా. తుకారాం రాథోడ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. తుకారాం రాథోడ్ జిల్లాలోని అన్ని డిపిఎంఓలు, ఎస్‌యూఓలు, హెచ్ఈలు, పిఎంఓలు, ఫార్మసీ అధికారులతో పాటు ల్యాబ్ టెక్నీషియన్లతో జూమ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర నిర్ధారణ కిట్ల లభ్యత, ఐహెచ్ఐపీ పోర్టల్‌లో నివేదికల సకాలంలో నమోదు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి ఆరోగ్య కేంద్రంలో మలేరియా ఆర్‌డిటి కిట్లు, హెచ్ఐవి & సిఫిలిస్ పరీక్షా కిట్లు, డెంగ్యూ రాపిడ్ టెస్ట్ కిట్ల నిల్వ పరిస్థితిని డీఎంహెచ్‌వో ప్రత్యేకంగా పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర వైద్య సేవలు అందించేందుకు అవసరమైన కిట్ల నిల్వ ఎల్లప్పుడూ తగిన స్థాయిలో ఉండాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఏదైనా ఆరోగ్య కేంద్రంలో కిట్ల కొరత ఏర్పడిన సందర్భంలో సంబంధిత ఫార్మసీ అధికారులు వెంటనే



ఈ-ఔషధి పోర్టల్ ద్వారా ఇండెంట్ నమోదు చేసి అవసరమైన సరఫరాలను పొందాలని ఆదేశించారు. సరఫరాల్లో నిర్లక్ష్యం వలన వైద్య సేవలు ప్రభావితమవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే వ్యాధి పర్యవేక్షణ ప్రజారోగ్య పరిరక్షణలో ఐహెచ్ఐపీ పోర్టల్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, ఎస్ ఫార్మ్స్, ఎల్ ఫార్మ్స్, పి ఫార్మ్స్ తదితర అన్ని ఫార్మాట్లను సకాలంలో ఖచ్చితంగా అప్డేట్ చేయాలని ఎంపిహెచ్‌ఏ (ఎఫ్), ఫార్మసీ అధికారులు ల్యాబ్ టెక్నీషియన్లకు ఆదేశించారు. ఐహెచ్ఐపీ పోర్టల్ అప్డేట్లలో నిర్లక్ష్యం వహించడం లేదా రికార్డుల నిర్వహణలో లోపాలు తలెత్తినట్లయితే సంబంధిత సిబ్బందిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో హెచ్చరించారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. తుకారాం రాథోడ్, నావా సంస్థ సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన యూపిహెచ్‌సి శేఖరం బంజార నూతన వ్యాక్సిన్ గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. తుకారాం రాథోడ్ మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య శాఖ అభివృద్ధి కార్యక్రమాల్లో నావా సంస్థ అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిలో నావా సంస్థ చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా. తుకారాం రాథోడ్ తో పాటు నావా సంస్థ ప్రతినిధులు రామకృష్ణ, శ్రీనివాస్, యూపిహెచ్‌సి శేఖరం బంజార మెడికల్ ఆఫీసర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కో ఆప్షన్ సభ్యత్వం పై నారాబోయిన సరిత శ్రీనివాస్ ఆవేదన

**బీఆర్ఎస్ నాయకత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం**

**జిన్నారం, హైదరాబాద్ పల్స్ న్యూస్, 05:**
సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీలో కో ఆప్షన్ సభ్యత్వం విషయంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు నారాబోయిన సరిత శ్రీనివాస్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 2001 సంవత్సరం నుండి బీఆర్ఎస్ పార్టీలో చురుకుగా పనిచేస్తూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నానని, 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరినా టికెట్ రాకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆహ్వానం మేరకు తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఇద్దరు కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపిస్తే కో ఆప్షన్ మెంబర్ పదవి ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ మాట నమ్మి బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి గడపగడపకు తిరిగి కృషి చేశానన్నారు. రెండో వార్డు అభ్యర్థి విజయానికి తన శ్రమ కారణమైందని, మొదటి వార్డు అభ్యర్థి ఓటమికి పార్టీ నాయకుల అంతర్గత విభేదాలే కారణమని ఆరోపించారు.ఎన్నికల అనంతరం కో ఆప్షన్ సభ్యత్వం ఇస్తామని చెప్పి చివరికి మాట తప్పారని ఆయన విమర్శించారు.కో ఆప్షన్ పదవి విషయమై కౌన్సిలర్లు, స్థానిక ఎమ్మెల్యే, బొల్లారం బాల్ రెడ్డి, శంభిపూర్ రాజు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి తదితరులను పలుమార్లు కలిసినప్పుడు తనకే పదవి ఇస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అయితే ఈ నెల 30వ తేదీన తన పేరును తిరస్కరించారనే సమాచారం రావడంతో పెద్దలను అడిగితే ఇంకా తనకే అవకాశం ఉందని చెప్పారని తెలిపారు. అయితే మంగళవారం జరిగిన పరిణామాల్లో కో ఆప్షన్ సభ్యత్వాన్ని పులిగిల్ల లక్ష్మి ప్రకాష్ చారికి కట్టబెట్టారని, మాజీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాష్ చారి బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎన్నికల్లో మద్దతుగా పనిచేయలేదని ఆరోపించారు. అలాంటి వారికి పదవి



ఇవ్వడం బాధాకరమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని లాఠీ దెబ్బలు తిని, అయ్యప్ప మాలలో ఉన్న సమయంలో జైలుకు వెళ్లిన తనలాంటి ఉద్యమ నాయకుడికి అన్యాయం చేయడం బాధ కలిగించిందని నారాబోయిన సరిత శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

# రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ చామల



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం రోజు రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం నిర్వహించబడింది. ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు, డిసిసి అధ్యక్షులు బీర్ల ఐలయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంటు పరిధిలోని ప్రభుత్వ విప్ వేముల వీరేశం, శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మందుల సామేల్ సంఘటన సృజన అభియాన్' భువనగిరి జిల్లా కోఆర్డినేటర్ మరియు ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నూతి శ్రీకాంత్ వివిధ జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గ కోఆర్డినేటర్లు, మున్సిపల్ చైర్మన్లు మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. సమగ్ర చర్చలు ప్రస్తుత రాజకీయ పరిణామాలు మరియు జిల్లా అభివృద్ధిపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ బలోపేతం బూత్ స్థాయి నుండి పార్టీని పటిష్టం చేయడం కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఎంపీ మరియు ఇతర నాయకులు దిశానిర్దేశం చేశారు.భవిష్యత్ కార్యచరణ: 'సంఘటన సృజన అభియాన్' కార్యక్రమంలో భాగంగా పార్టీని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి అనే అంశంపై



భవిష్యత్ ప్రణాళికను రూపొందించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో దిశా నిర్దేశం చేసిన, డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య


**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి బైపాస్ రోడ్డులోని కొత్త వివేరా హోటల్లో యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు జిల్లా అభివృద్ధిపై చర్చించి బూత్ స్థాయి నుండి పార్టీని పటిష్టం చేసే దిశగా దిశ నిర్దేశం చేయడం జరిగింది. సంఘటన సృజన అభియాన్ లో భాగంగా పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు భవిష్యత్తు ప్రణాళికను రూపొందించడం జరిగింది. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ....ప్రస్తుత రాజకీయ పరిణామాలపై సమగ్రంగా విశ్లేషణ చేస్తూ జిల్లా అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో పార్టీ బలోపేతం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, గ్రామ స్థాయి నుండి బూత్ స్థాయి వరకు సంస్థాగత నిర్మాణాన్ని మరింత దృఢంగా తీర్చిదిద్దాల్సిన అవసరాన్ని వివరించారు. పార్టీ కార్యకర్తలే పార్టీకి బలం అని పేర్కొంటూ, ప్రతి కార్యకర్త ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. అలాగే, సంఘటన సృజన అభియాన్లో భాగంగా పార్టీని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రచార విధానాలు, యువత మరియు మహిళల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వంపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని క్రమబద్ధమైన ప్రణాళికతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధి మరియు ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేస్తూ, అందరూ ఐక్యంగా పనిచేసి పార్టీ విజయానికి



తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మందుల సామేల్, సంఘటన సృజన అభ్యాన్' జిల్లా కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నూతి శ్రీకాంత్, వివిధ జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గ కోఆర్డినేటర్లు, మున్సిపల్ చైర్మన్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బక్రీద్ నేపథ్యం.. పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవు

**జిల్లా ఎస్పీ నితికా పంత్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణా, చట్టవిరుద్ధ వధ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలో 11 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల నిఘా కొనసాగిస్తున్నట్లు ఎస్పీ నితిక పంత్ తెలిపారు.పశువుల రవాణా, కొనుగోలు, వధకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనుమతులు లేకుండా రవాణా లేదా వధ జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అక్రమ రవాణా సమాచారం తెలిసిన వారు 8712670557 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. ప్రజలు స్వయంగా వాహనాలను అడ్డుకోవడం, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం చేయవద్దని సూచించారు. పుకార్లు, అసత్య ప్రచారాలను నివారించి పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# సైబర్ నేరాల నియంత్రణపై పోలీస్ సైబర్ వారియర్స్‌కు శిక్షణ

**సైబర్ వారియర్స్‌కు టీ-షర్ట్స్ పంపిణీ చేసిన ఎస్పీ నితికా పంత్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05 కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** సైబర్ నేరాలను సమర్థవంతంగా నియంత్రించేందుకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో గల పోలీస్ సైబర్ వారియర్స్‌కు మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ శిక్షణ కార్యక్రమంలో సైబర్ నేరాల స్వరూపం, వాటిని ముందుగానే గుర్తించే విధానాలు, అలాగే సైబర్ నేరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమగ్రంగా వివరణ ఇచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ సైబర్ వారియర్స్‌కు సైబర్ టీ-షర్ట్స్‌ను అందజేసి, ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంచడంలో వారు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ బుద్దె స్వామి, సైబర్ క్రైమ్ సబ్ ఇన్స్పెక్టర్ దివ్య మరియు సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ జన్మదినం, వివాహ వార్షికోత్సవ వేడుకలు



**హైదరాబాద్ పల్స్, మే 05, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
డోర్నకల్ మండలం పేరుమండ్ల సంకీస గ్రామంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ జన్మదిన వేడుకలు మరియు ఆయన, ప్రేమీల దంపతుల వివాహ వార్షికోత్సవం ఒకే రోజు రావడంతో ఘనంగా నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. డోర్నకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యే దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు ఎమ్మెల్యే సేవలను కొనియాడుతూ ఆయనకు ఆయురారోగ్యాలతో పాటు మరిన్ని విజయాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జీడి మధు, బొడ్రాయి తండా సర్పంచ్ సంపూర్ణ, జోగ్యతండా సర్పంచ్ డాక్టర్ చందవత్ రమేష్ నాయక్, కాసం శేఖర్, చిలుకోడు మాజీ సర్పంచ్ రాయల వెంకట బాబు, గండు బాబు, ఆంగోత్ వెంకన్న, జామ్లు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఎమ్మెల్యే డా. రామచంద్ర నాయక్ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు



**హైదరాబాద్ పల్స్, మే 05, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
డోర్నకల్ పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలను మున్సిపల్ చైర్‌పర్సన్ కొండేటి రాజకుమారి హరినాథ్, వైస్ చైర్‌పర్సన్ మాద లావణ్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలతో పాటు వారి దాంపత్య జీవితం సాఫల్యంగా కొనసాగాలని పెళ్లిరోజు శుభాకాంక్షలు కూడా తెలిపారు. ప్రజల సేవే ధ్యేయంగా ముందుకు సాగుతున్న నాయకుడిగా ఆయనను కొనియాడారు. వేడుకల భాగంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నాలుగు చలివేంద్రాలను ప్రారంభించి, వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాద్విజ, పట్టణ అధ్యక్షుడు కాల సుమేర్ జైన్, ఉపాధ్యక్షుడు యల్లవుల హరికృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ సాధనాల వెంకటేశ్వర్లు,



కౌన్సిలర్లు గారే రమేష్, రాంకోటేష్, బాదావత్ వీరన్న, బానోతు ప్రమీల రమేష్, హేమలత, కేశబోయిన సంధ్య వెంకటేష్, తాళ్లూరి హనుమ, బిక్కసాని నల్లబోలు శ్రీనివాస్, మామిడి నాగరాజు, రమణ, దోమల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా భారీగా హాజరై తమ నాయకుడికి శుభాకాంక్షలు తెలిపారు.

# కుమ్మరి శాలివాహన సర్పంచ్ లకు
# రవీంద్రభారతిలో వైభవంగా సన్మాన సభ




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
తెలంగాణ గ్రామీణ రాజకీయాల్లో బీసీ వర్గాల ప్రాధాన్యతను ప్రతిబింబిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికైన కుమ్మరి శాలివాహన వర్గానికి చెందిన 93 మంది సర్పంచ్‌లకు ఘన సన్మానం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధి, స్థానిక పాలనలో పారదర్శకత, సంక్షేమ కార్యక్రమాల అమలులో వారు చూపుతున్న నాయకత్వాన్ని గుర్తిస్తూ బీసీ టైమ్, బీసీ సమాజ్ సంస్థలు ఈ కార్యక్రమాన్ని విశిష్టంగా ఏర్పాటు చేశాయి. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కళాక్షేత్రం ఈ సందర్భంగా సామాజిక చైతన్య వేదికగా మారింది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన సర్పంచ్‌లకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేస్తూ వారి సేవలను కొనియాడారు. గ్రామీణ స్థాయిలో బీసీ వర్గాల ఎదుగుదల, నాయకత్వ సామర్థ్యాన్ని ఈ సన్మానం ప్రతిఫలింపజేసిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ వేడుకలో మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండలం ఉప్పరిగూడెం గ్రామ సర్పంచ్ మల్లికంటి సురేష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ ప్రజలకు చేరువైన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందిన నేపథ్యంలో వేదికపై ప్రత్యేకంగా సత్కరించారు. ఆయన సేవలను ప్రశంసిస్తూ పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారతకు ఇలాంటి సన్మానాలు ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ అభివృద్ధి పునాది స్థాయిలో బలపడాలంటే స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర అత్యంత కీలకమని వారు అన్నారు. ఈ సన్మాన సభ కేవలం గౌరవ కార్యక్రమంగా కాకుండా, బీసీ వర్గాల ఐక్యత, స్వాభిమానానికి ప్రతీకగా నిలిచింది. భవిష్యత్తులో మరింత మంది బీసీ నాయకులు ప్రజాసేవలో ముందుకు రావాలని, గ్రామాల అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.

## ఆయిల్‌పాం సాగుకు అర్హులైన రైతులు ముందుకు రావాలి : కలెక్టర్ హరిత

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆయిల్‌పాం సాగుకు అనుకూల వాతావరణం ఉందని, సాగునీటి సౌకర్యం ఉన్న రైతులు తప్పనిసరిగా ముందుకు రావాలని కలెక్టర్ హరిత పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జరిగిన ఆసిఫాబాద్ నియోజకవర్గ రైతువారం సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, మొదటి నాలుగు సంవత్సరాలు అంతర్పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. చీడపురుగులు, పశువులు, కోతుల బెడద లేని ఈ పంట ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని వివరించారు. పత్తి, వరి వంటి సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా కూరగాయలు, ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలని సూచించారు. విదేశాల నుండి దిగుమతవుతున్న వంట నూనెలను దేశీయంగా ఉత్పత్తి చేయడానికి ఈ పంట దోహదపడుతుందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం. డేవిడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కాండే అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్లు ఇరుకుల్ల మంగ, కుద్మేత విశ్వనాద్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నదీమ్,



వ్యవసాయ శాఖ అధికారి వెంకటి పాల్గొన్నారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తున్న రైతులను శాలువాలతో సన్మానించారు.

## సిపిఎం పార్టీకి కో ఆప్షన్ మెంబర్ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**కృతజ్ఞతలు తెలిపిన కల్లూరి మల్లేశం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మంగళవారం రోజున ఆలేరు మున్సిపాలిటీ కి సంబంధించిన కోఆప్షన్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఇందులో సిపిఎం పార్టీ నుండి కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన ఇంతియాజ్ ఇర్ఫానా కో ఆప్షన్ సభ్యులుగా ఎమ్మెల్యే సమక్షంలో మున్సిపల్ కమిషనర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం హాజరై మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో పొత్తు ధర్మాన్ని పాటిస్తూ ఈరోజు సిపిఎం పార్టీకి మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి, ఆలేరు మున్సిపల్ చైర్మన్ శ్రీమతి బీజని బాలమణి భాస్కర్ కి ధన్యవాదాలు తెలియజేశారు. సిపిఎం పార్టీకి వచ్చిన ఈ అవకాశంతో ప్రజా సమస్యలపై పాలకవర్గంలో చర్చించి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం సిపిఎం పార్టీ ముందుంటుందని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఇందుకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు మున్సిపల్ కౌన్సిలర్లకు అందరికీ



వారు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల్, సిపిఎం మండల కార్యదర్శి దుపటి వెంకటేష్, నాయకులు మొరిగాడి రమేష్, జూకంటి పౌలు, వడ్డేమాన్ బాలరాజు, రైతు సంఘం నాయకులు సూదగాని సత్య రాజయ్య, మొరిగాడి అజయ్, గనగాని మల్లేష్, నల్లమాస తులసయ్య, మహిళా సంఘం నాయకురాలు మొరిగాడి భాగ్యలక్ష్మి, వడ్డేమాన్ విప్లవ్, కాసుల నరేష్, చెన్న రాజేష్, మాదాని నవీన్, బర్ల సిద్ధులు, ఎండి మథిన్, ఎండి ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# కైలాసపురంలో ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు...

**జరిపించిన జనగామ నివాసకులు మల్కాపురం దేవిక ప్రమోద్....**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, కైలాసపురం కాచారం దేవాలయంలో శ్రీ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వైశాఖమాసం మంగళవారం రోజున కైలాస పురంలో వెలసిన చల్లని తల్లి రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు కార్యక్రమం డా. వంగపల్లి అంజయ స్వామి ఆధ్వర్యంలో జరిపించిన జనగామ నివాసకులు మల్కాపురం ప్రమోద్ దేవిక ఈరోజు అమ్మవారికి చీరే సారే మామిడిపండ్ల పట్టి ముత్తైదువులకు పసుపు, బొట్టు అలాగే దేవతకు ప్రత్యేక పూజలు జరిపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజ్జాల నాగరాజు, లక్ష్మీ ప్రసన్న మేడ్చల్ జిల్లా అసోసియేషన్ కోశాధికారి, హైదరాబాద్, అనంత పల్లి సర్పంచ్ చిలుక బాబు, మార్కండేయ, కల్పన, చిత్ర, శ్రావ్య వేములవాడ వాస్తవ్యులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా జన్మదిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమం జరిగింది, ఇట్టి మహా కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు రఘునాథపురం బిజ్జాల ఈశ్వర్ గుప్తా, బిజ్జాల నరసింహులు గుప్తా, హైదరాబాద్ వాస్తవ్యులు రాయల్ చాలెంజ్ వాటర్ డిస్ట్రిబ్యూటర్ ల గోపి లావణ్య, సిద్దిపేట వాస్తవ్యులైన ఉప్పరపల్లి రోహిత్ ఝాన్సీ సాఫ్ట్వేర్ ఉద్యోగులు, గాజుల చంద్రమౌళి సుమలత వరంగల్ జిల్లా యాదవ మహిళ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.



## సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా
# సంతోష్ బాధ్యతలు



**హైదరాబాద్ పల్స్, మే 05, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నూతనంగా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా సంతోష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విధుల పట్ల నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం, మంగళవారం జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పోలీస్ వ్యవస్థలో సమర్థవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని సంతోష్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ శబరిష్, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కు అభినందనలు తెలియజేసి, విధుల్లో నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.

## తిర్యాణి నూతన డీఎస్పీ అశోక్‌కు బీజేపీ నాయకుల సన్మానం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి**
కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ అశోక్‌కు బీజేపీ మండల నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సారా రమేష్, ఎన్నికల కన్వీనర్ పులి వెంకటేష్, నాయకులు ఆత్రం గోపాల్, జెడ సంతోష్, హైందవ సంఘం మండల అధ్యక్షులు రంగు అరుణ్ కుమార్, సారా శంకర్ గౌడ్, ఎస్టీ మోర్చా జిల్లా నాయకుడు తొడసం భాస్కర్, బూత్ అధ్యక్షులు మంగ రాజేష్, తొడసం దాస్వంత్ రావు, మదవి దాస్వంత్ రావు, సిడం కృష్ణ, రామచారి తదితరులు పాల్గొన్నారు.

## డోర్నకల్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల హన్మకొండ కిసాన్ మేళా పర్యటన




**హైదరాబాద్ పల్స్, మే 05, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
డోర్నకల్ మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో నిర్వహించిన మెగా కిసాన్ మేళా కార్యక్రమానికి డోర్నకల్ మండలం నుండి రైతులను సమూహంగా తీసుకువెళ్లడం జరిగింది. ఈ మేళాలో రైతులకు వ్యవసాయ రంగంలో తాజా సాంకేతిక పరిజ్ఞానం, నూతన విత్తన రకాలు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్ టెక్నాలజీ వినియోగం, పశుసంపద అభివృద్ధి వంటి అంశాలపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారు. వివిధ ప్రదర్శనలు, ప్రత్యక్ష డెమోలను వీక్షించిన రైతులు కొత్త పద్ధతులపై ఆసక్తి వ్యక్తం చేశారు. డోర్నకల్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులను సమన్వయం చేసి బస్సు సౌకర్యంతో ఈ కార్యక్రమానికి తరలించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రైతులు ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఆధునిక పద్ధతులను నేర్చుకుని వ్యవసాయంలో మరింత అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో అధికారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఈ మెగా కిసాన్ మేళా కార్యక్రమం మరుసటి రోజులు కూడా కొనసాగనున్న నేపథ్యంలో, డోర్నకల్ మండలం నుండి మరిన్ని రైతులను బస్సుల ద్వారా తీసుకువెళ్లే ఏర్పాట్లు చేసినట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఈవీఎం గోదాముకు పటిష్ట భద్రత : కలెక్టర్ హరిత తనిఖీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) గోదాముకు పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు కలెక్టర్ హరిత తెలిపారు. మంగళవారం నెలవారీ తనిఖీలో భాగంగా గోదామును సందర్శించి సీసీ కెమెరాల పనితీరు, గేటు సీళ్లను పరిశీలించారు. గోదాముకు 24 గంటలూ సీసీ కెమెరా పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.తనిఖీలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జమీల్, నాయబ్ తహసీల్దార్ శ్యాంలాల్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పనిసరిగా సమయపాలన పాటించాలి : కలెక్టర్ హరిత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని కలెక్టర్ హరిత హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ భవనంలోని జిల్లా భూకొలతల అధికారి కార్యాలయం, జిల్లా సహకార శాఖ అధికారి కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు రిజిస్టరు పరిశీలించి సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించకుండా విధులకు గైర్హాజరయ్యే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# రద్దీ ప్రదేశాల పార్కింగ్ నిర్వహణ డిజైన్‌కు భారత ప్రభుత్వ పేటెంట్... జిల్లాకు గర్వకారణం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా విద్యార్థిని అల్సా మమత రూపొందించిన పార్కింగ్ స్థలం నిర్వహణ రద్దీగా ఉన్న స్థలం డిజైన్‌కు భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం అధికారిక నమోదు (రిజిస్ట్రేషన్ నం. 486267-001) మంజూరు చేసింది. జనవరి 5, 2026న నమోదైన ఈ ఆవిష్కరణను విద్యార్థిని అల్సా మమత, ఉపాధ్యాయుడు మౌల్కర్ కేశవ్, జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ సంయుక్తంగా రూపొందించారు. నగరాల్లో పెరుగుతున్న ట్రాఫిక్ మరియు పార్కింగ్ సమస్యలకు సాంకేతిక పరిష్కారం చూపించేందుకు ఈ డిజైన్ దోహదపడనుంది. కలెక్టర్ హరిత విద్యార్థిని, ఉపాధ్యాయుడు, జిల్లా సైన్స్ అధికారిని అభినందించారు. గ్రామీణ ప్రాంతం నుండి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం జిల్లా యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. నో పార్కింగ్ జోన్లలో వాహనాలు నిలిపినప్పుడు అధికారులకు స్వయంచాలకంగా సమాచారం అందించే పరికరం రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి లలిత పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం సాయం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం దూది వెంకటాపురం గ్రామానికి చెందిన వంకొల్ల పరశు రాములు మృతి చెందగా మంగళవారం కుటుంబాన్ని పరామర్శించిన దూది వెంకటాపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఉపాధ్యాయ బృందం మానసిక ధైర్యాన్ని అందించారు. ముగ్గురు చిన్న పిల్లలు తండ్రి లేని అనాధలు కావడంతో పరామర్శించిన అనంతరం 50 కిలోల బియ్యం, 5 కిలోల నూనె, కందిపప్పు చింతపండు సాయం చేశారు.

# అద్భుత ఫలితాలకు కెరాఫ్ రఘునాథపురం ఉన్నత పాఠశాల

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం రఘునాథపురం ఉన్నత పాఠశాల తన ఉనికిని చాటుకుంటూ అత్యద్భుత ఫలితాలు సాధిస్తూ వస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభం నుండే ప్రధానోపాధ్యాయులు కె. మనోజ్ కుమార్ పక్కా ప్రణాళికను రూపొందించారు. దానిలో భాగంగా 2025-26 విద్యా సంవత్సరంలో 6వ, తరగతి విద్యార్థులకు ప్రారంభ పరీక్షను అన్ని సబ్జెక్టులతో విర్వహించి వారని గ్రూపులుగా విభజించి చదువులో వెనుకబడిన విద్యార్థులకు నాటి నుంచి రెమి జియల్ లీచింగ్ ప్రారంభించారు. దీనికి బాసటగా అంకిత భావం గల ఉపాధ్యాయులు నిలిచి వారి బాధ్యతను నూటికి నూరు శాతం నిర్వర్తించారు. దీనిలో భాగంగా భాషోపాధ్యాయులు వివిధ భాషపైన తెలుగు, హిందీ, ఆంగ్లం లలో చదవడం, రాయడం పై శ్రద్ధ చూపి విద్యార్థుల చేత రాతపై ప్రత్యేక తర్ఫీదును ప్రత్యేక అందించారు. గణిత ఉపాధ్యాయులు తమదైన శైలిలో విద్యార్థుల తార్కిక ఆలోచనను పెంపొందింపజేస్తూ కఠినమైన గణితాన్ని అత్యంత సులువుగా అవగాహన కల్పించడంలో సఫలీకృతులైనారు. ఇక శాస్త్రీయ వైఖరిని పెంపొందించడంలో భాగంగా విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులు ఆధునిక ప్రయోగశాలను నిరంతరం ఉపయోగం ను విద్యార్థులలో విజ్ఞాన శాస్త్రం పట్ల అభిరుచిని పెంపొందిస్తూ ఉన్నారు. అలాగే సామాజిక శాస్త్ర ఉపాధ్యాయులు సాంఘీక్ శాస్త్రాన్ని అందులో గల పలు అంశాలను సమకాలిన అంశాలతో జోడిస్తూ సామాజిక శాస్త్రాలపై విద్యార్థులకు మరిత అవగాహన కల్పిస్తున్నారు.క్రీడల పై ప్రత్యేక శ్రద్ధ "అరోగ్య వంతమైన శరీరంలోనే ఆవరోధవంతమైన మునస్సు ఉంటుంది" అనే నానుడిని ఋజువు చేస్తూ వ్యాయామ ఉపాధ్యాయులు వివిధ క్రీడలలో విద్యార్థులకు తర్ఫీదును ఇస్తూ విద్యార్థులతో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తూ ఉన్నారు.ఇంకా విద్యార్థులతో వస్తలాఘవ నైపుణ్యాన్ని వృద్ధి చేసేందుకు, సృజానత్మకతను పెంపొందించుటకు కుట్లు, అల్లికల పై ఫల ప్రదమైన క్రాఫ్ట్ ఇన్స్ట్రక్టర్స్ శిక్షణ అందిస్తూ ఉన్నారు. వారాంతం ఈ విషయాలన్నింటినీ ప్రధానోపాధ్యాయులు కె. మనోజ్ కుమార్ ప్రతి విషయాన్ని సమీక్షిస్తూ తగిన సూచనలను ఉపాద్యాయులకు అందిస్తూ, ప్రతి మాసం జరిగే పి.టి.ఎం.లో విద్యార్థుల తల్లిదండ్రులకు వారి పిల్లల ప్రగతిని నివేదిస్తూ ఉండడం విశేషం. ఆ విధంగా ప్రధానోపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణలో ఎస్.ఎస్.సి మార్చి / ఏప్రిల్ 2026 ఫలితాలలో 61 మంది విద్యార్థులకు గాను 61 మంది ఉత్తర్ణులై పాఠశాలకు 100%, ఫలితాలు అందించారు. ఈ ఫలితాలలో కె. ప్రజ్వల్ 569 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిల్వగా జిల్లా స్థాయిలో 5వ స్థానం పొందాడు. అలా మండల స్థాయి-13, 35, 52, 73, 85, 10 జిల్లా స్థాయిలో కవ, 10వ స్థానాలను సాధించారు. మార్కుల పరంగా చూస్తే రఘునాథపురం పాఠశాల విద్యార్థులలో 11 మంది 550, ఆపై " 30 మంది 500 మార్కుల పైగా, 58 మంది 400 మార్కులు దాటడం ప్రత్యేకం. కొసమెరుపుగా ఇదే పాఠశాల నుంచి,




ఎన్.ఎం.ఎం.ఎస్. లో భాగంగా ముగ్గురు విద్యార్థులు ప్రొవిజినల్ సెలెక్షన్ లిస్టులో ఉండడం విశేషం. దీనితోపాటు సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో ఈ పాఠశాలది ఒక ప్రత్యేక స్థానంగా చెప్పవచ్చు. ఈ పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి నిరంతర విద్యార్థుల శ్రేయస్సును కోరుతూ విద్యార్థుల విద్యా దాహాన్ని తీర్చడంలో తలమునకలవుతున్న ఉపాధ్యాయ బృందం శివరామ, శ్రీనివాసాచారి,జయప్రద, అపర్ణాదేవిసత్యనారాయణ, వెంకటేశ్వర్లు సునిత, సమ్మిరెడ్డి, శ్రీహరి,సుబ్బరాజు, యాదయ్య, సరిత,బాలక్రిష్ణ, క్రిష్ణమూర్తి, మనీష, భవాని, షబీన్, గణేష్, శ్రీవాణిల సేవలు' రఘునాథపురం పాఠశాలకు మకుటాయమానంగా, ఆదర్శంగా నిలుస్తున్నాయి.

# మే 10న జహీరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి శంకుస్థాపన

**త్వరలో తెలంగాణలో 1.74 లక్షల ఉద్యోగాలు**

**రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి జహీరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ చోదక శక్తిగా నిలవనుంది**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, మెయిన్ డెస్క్:** తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధికి మరో కీలక అడుగు పడుతోంది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు రాష్ట్రానికి పెట్టుబడులు, ఉపాధి అవకాశాల పరంగా కొత్త దిశను చూపనుంది. హైదరాబాద్--నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టు, ఆధునిక మౌలిక వసతులతో తయారీ రంగానికి గట్టి బలం చేకూర్చేలా రూపకల్పన చేశారు.రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి జహీరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ చోదక శక్తిగా నిలవనుంది. జహీరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ తయారీ రంగం, ఆర్థిక అభివృద్ధికి గణనీయమైన ఊపునిస్తుంది. 3,245 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పారిశ్రామిక స్మార్ట్ సిటీని రూ.2360.54 కోట్ల ప్రాజెక్టు వ్యయంతో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో సమగ్ర కేంద్రంగా తీర్చిదిద్దాలని సంకల్పించారు.

**ఇండస్ట్రియల్ కారిడార్ ప్రత్యేకతలు:**

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ రూ.10,000 కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించే సామర్థ్యంతో పాటు 2029 నాటికి 1.74 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఏర్పాటు అవుతోంది. లాజిస్టిక్స్, ఆటో విడిభాగాలు, లోహేతర ఖనిజాలు, విద్యుత్, ఎలక్ట్రానిక్స్, యంత్ర పరికరాలు, లోహాలు, ఆహార శుద్ధి రంగాలపై దృష్టి సారించనున్నారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన స్మార్ట్ మౌలిక సదుపాయాలు,సుస్థిర మరియు పర్యావరణ హిత అభివృద్ధి విధానాలు'ప్లగ్-అండ్-ప్లే' పారిశ్రామిక వసతులు కల్పించనున్నారు. నివాస, వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు, శిక్షణా సంస్థలతో కూడిన సమగ్ర పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.



**మే 10న మోదీ శంకుస్థాపన**

జహీరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ తెలంగాణలో తదుపరి తరం పారిశ్రామిక వృద్ధికి చోదకశక్తిగా నిలవనుందని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మంగళవారం ఎక్స్ పోస్టులో వెల్లడించారు. హైదరాబాద్-నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌లో వ్యూహాత్మక ప్రదేశంలో ఉన్న జహీరాబాద్ సమీకృత పారిశ్రామిక స్మార్ట్ సిటీ, భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ, ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ఒక ప్రధాన తయారీ, లాజిస్టిక్స్ కేంద్రంగా మారడానికి సిద్ధంగా ఉందని మంత్రి పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రూ.2360.54 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు మే 10న శంకుస్థాపన చేయనున్నారని కేంద్రమంత్రి జి కిషన్ రెడ్డి తెలిపారు.

మొత్తంగా జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు తెలంగాణను దేశంలోని ప్రముఖ తయారీ, లాజిస్టిక్స్ కేంద్రంగా నిలబెట్టే సామర్థ్యం ఉంది. భారీ పెట్టుబడులను ఆకర్షించడం, లక్షలాది మందికి ఉపాధి కల్పించడం ద్వారా ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. ప్రణాళికల ప్రకారం అమలు జరిగితే, ఇది రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి గేమ్‌చేంజర్‌గా నిలిచే అవకాశముంది.

# సీఎం సీటు నుంచి దిగనంటున్న దీదీ..వాట్ నెక్ట్స్..? బెంగాల్ లో ఇదే జరిగేది..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, కోల్‌కత్తా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణముల్ కాంగ్రెస్ ఓటమిని ఆ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ జీర్ణించుకోలేకపోతున్నారు. బెంగాల్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని.. లోక్ భవన్‌కు వెళ్లనని.. గవర్నర్?కు రాజీనామా లేఖను ఇవ్వనని దీదీ మొండికేసి కూర్చున్నారు. ఇదిలా ఉండగా.. మే 6వ తేదీతో బెంగాల్ ప్రభుత్వ పదవీ కాలం ముగుస్తుంది. ఈ క్రమంలో మమతా బెనర్జీకి రాజీనామా చేసి తప్పుకోవడం తప్ప మరో దారి లేదు. కానీ.. మమత రాజీనామా చేసే సమస్యే లేదంటూ చేసిన ప్రకటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. ఎందుకంటే.. మన ప్రజాస్వామ్య దేశంలో ఏ రాష్ట్రంలో అయినా ముఖ్యమంత్రి నేతృత్వం వహిస్తున్న పార్టీ ఎన్నికల్లో ఓడిపోతే అప్పటికి సీఎం పదవిలో ఉన్న వ్యక్తి గవర్నర్?ను కలిసి రాజీనామా లేఖను సమర్పిస్తారు.సీఎం స్థానంలో ఉండే శాసనసభా పక్ష నేత రాజీనామాతో శాసనసభ రద్దవుతుంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరేందుకు గెలిచిన పార్టీకి గ్రీన్ సిగ్నల్ వస్తుంది. ఇప్పటిదాకా ఇలానే జరిగింది. అయితే.. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ మొత్తం 294 సీట్లకు గాను ఏకంగా 207 స్థానాలు గెలిచింది. అయినప్పటికీ మమతా బెనర్జీ సీఎం పదవి నుంచి తప్పుకోవడానికి సిద్ధంగా లేరు.

ఇలాంటి సమయంలో.. ఏం జరుగుతుందంటే..

ఆమె ప్రతిఘటన వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఆమె ప్రభుత్వానికి ఐదేళ్ల కాల పరిమితి ముగిసిపోయిన మరు క్షణం గవర్నర్ రాష్ట్ర శాసనసభను రద్దు చేయవచ్చు. ఆమె ప్రభుత్వ పదవీకాలం కూడా ముగుస్తుంది. గెలిచిన పార్టీని కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానిస్తారు. ఎమ్మెల్యేల మద్దతు నిరూపించుకున్న అనంతరం.. సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకారం ఉంటుంది.పశ్చిమ బెంగాల్?లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కావాల్సిన కనీస




మెజార్టీ (మ్యాజిక్ ఫిగర్) 148 సీట్లను సునాయాసంగా దాటిన కమలం పార్టీ.. రెండింట మూడొంతుల సీట్ల(196) మార్కును కూడా దాటి సత్తా చాటింది. మమత నేతృత్వంలోని టీఎంసీ బీజేపీ హవాతో ఈసారి 80 సీట్లకే పరిమితమైపోయింది. ఇక ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 2, ఏజేయూపీ 2, సీపీఎం 1, ఏఐఎస్‌ఎఫ్ పార్టీ 1 సీటు చొప్పున గెలుచుకున్నాయి.

# ఉప్పల సిద్ధి లింగం వివాహ దినోత్సవ వేడుకలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన రాజపేట మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి రఘునాథపురం పట్టణ శాఖ అధ్యక్షులు ప్రముఖ వ్యాపారవేత్త దాత ఉప్పల సిద్ధి లింగం నాగరాణి పుణ్య దంపతుల వివాహ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులను సత్కరించి వివాహ దినోత్సవ శుభాకాంక్షలు. సోషల్ మీడియా ద్వారా, ఫోన్ల ద్వారా పలువురు శుభాకాంక్షలు చెప్పారు



# అంగరంగ వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

**ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ ఎస్ఐ సతీష్**





**జమ్మికుంట, మే 05 ( హైదరాబాద్ పల్స్):**
జమ్మికుంట పట్టణ పరిధిలో శంకర్ నందన గార్డెన్స్ నుండి ప్రారంభమైన హనుమాన్ శోభాయాత్రను ఘనంగా ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంలో హిందూ సేవాసమితి, బ్రదర్స్ టీమ్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ హనుమాన్ వారి ఆశీర్వాదంతో జమ్మికుంట పట్టణ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ హనుమాన్ శోభాయాత్రలో హనుమాన్ భక్తులు, హిందూ బంధువులు యువకులు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ ఎస్ఐ సతీష్ హనుమాన్ భక్తులు హిందూ బంధువులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన శీలం శ్రీనివాస్



**హైదరాబాద్ పల్స్, మే 05, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్ర నాయక్ గారి జన్మదినం మరియు వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం కురవి మండలం కేంద్రంలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతుల ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ప్రార్ధనలు చేశారు. డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శీలం శ్రీనివాస్, ఈ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శీలం శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న రామచంద్ర నాయక్, ప్రజానాయకుడిగా విశేష గుర్తింపు పొందారని కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఆయన పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. అలాగే, భగవంతుడు రామచంద్ర నాయక్--ప్రమీల, దంపతులకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో మరింత ముందుకు సాగుతూ ప్రజల ఆశయాలను నెరవేర్చాలని శీలం శ్రీనివాస్ కోరుకున్నారు.

# యాదగిరిగుట్ట నారసింహుని హుండీ ఆదాయం రూ.2.48 కోట్లు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, యాదాద్రి భువనగిరి ప్రతినిధి:**
: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి హుండీలను మంగళవారం ఆలయ సిబ్బంది లెక్కించారు. ఎస్పీఎఫ్ హోంగార్డుల భద్రత నడుమ స్వామి వారి హుండీలను కొండకింద సత్యనారాయణ స్వామి మండపంలోకి తరలించి ఈవో భవాని శంకర్ ఆలయ చైర్మన్ నరసింహమూర్తి పర్యవేక్షణలో కౌంటింగ్ చేపట్టారు. భక్తుల చేత 36 రోజుల హుండీ ఆదాయం 2,48,53,666 రూపాయలు వచ్చాయి. స్వామివారికి మిశ్రమ బంగారం 64 గ్రాములు, మిశ్రమ వెండి 3 కిలోలు విదేశీ కరెన్సీ అమెరికా312 డాలర్లు, ఆస్ట్రేలియా 40 డాలర్లు, ఇంగ్లాండ్ 55 పౌండ్స్, నేపాల్ 55, మలేషియా 28 సింగపూర్ 9 కెన్యా 100 స్వీడన్ 20 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

# కోతుల నివారణకై మార్త జగదీశ్వర్ రచించిన పాట విడుదల

**సర్పంచ్ కోయ మధు సమక్షంలో మార్త జగదీశ్వర్ తల్లి సిద్దమ్మ చేతుల మీదుగా ఆవిష్కరణ**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** కోతుల నివారణకు కంకణ బద్ధుడై యజ్ఞంలా కార్యసిద్ధి కోసం కృషి చేస్తున్న సామాజిక చైతన్య వేదిక నిర్వాహకులు మార్త జగదీశ్వర్ ప్రత్యేకంగా రచించిన పాటను మంగళవారం తన మాతృమూర్తి మార్త సిద్ధమ్మ చేతులమీదుగా సర్పంచి కోయ మధు సమక్షంలో ఆవిష్కరణ జరిగింది. రాజపేట లోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ప్రజలు భక్తులు హనుమాన్ మాల ధారణ స్వాముల సమక్షంలో ఈ ఆవిష్కరణ చేసి పాటను మార్త జగదీశ్వర్ వినిపించారు. ప్రతి ఒక్కరూ తన మద్దతును ఆనందాన్ని తెలియజేస్తూ చప్పట్లతో మార్త జగదీశ్వర్ ను అభినందించారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కోతుల నివారణకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కోతుల వల్ల జరుగుతున్న అనర్థాలను ఆయన వివరించారు. పంట నష్టాలను కలిగించే అకాల అనర్థాల వర్షాల నివారణకు ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని త్వరలోనే రాజపేటలో చేపట్టనున్నట్లు మార్త జగదీష్ ఈ సందర్భంగా తెలిపారు. ప్రత్యేక పాటను రచించిన మార్త జగదీశ్వర్ ను ప్రతి ఒక్కరూ ప్రత్యేకంగా అభినందించారు. పాట ఆవిష్కరణలో పాల్గొన్న సర్పంచి కోయమదును చేనేత శాలువాతో సత్కరించారు. “ ధర్మభూమి, కర్మభూమి, పుణ్యభూమి దేశంలో కలత చెంది రాస్తున్న రైతన్నల స్వేదంతో అంటూ పాటను చక్కగా మార్త జగదీష్ రచించడం 4 నిమిషాల 40 సెకండ్లు పాట అద్భుతంగా ఉందని జగదీశ్వర్ ను ప్రతి ఒక్కరూ అభినందించారు.

# కో ఆప్షన్స్ సభ్యులకు నియామకం పత్రలను అందజేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీలో నలుగురు కో ఆప్షన్స్ సభ్యుల నియామకం కోసం ప్రత్యేక సమావేశం మంగళవారం చైర్మన్ బీజన బాలమణి అధ్యక్షతన జరిగింది. కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన ఎంఎస్ విజయ్ కుమార్, చింతకింది మురళి, గుత్తా శమంతారెడ్డి, సిపిఎం కు చెందిన ఇంతియాజ్ ఇర్ఫానా కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారికి నియామకం పత్రలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అందజేసారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, కౌన్సిలర్లు జూకంటి సంపత్, పస్తం ఆంజనేయులు, మల్లెల సరిత, జెట్ట నీరజ, వానరాశి మరియమ్మ, బీజన కళ్యాణి, మున్సిపల్ కమీషనర్ కె శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రపంచాన్ని వణికిస్తున్న కొత్త వైరస్.. నడి సముద్రంలో నౌక కలకలం!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05 :**
అట్లాంటిక్ మహాసముద్రంలో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. డచ్‌కు చెందిన 'ఎం.వి. హొండియస్' అనే క్రూయిజ్ నౌకలో అరుదైన వైరస్ వ్యాప్తి చెందడంతో దాదాపు 150 మంది ప్రయాణికులు సముద్ర మధ్యలోనే చిక్కుకుపోయారు. కేప్ వెర్డే తీరానికి సమీపంలో ఉన్న ఈ నౌకలో ఇప్పటికే ముగ్గురు మృతి చెందగా, మరికొందరు తీవ్ర అస్వస్థతతో ప్రాణాల కోసం పోరాడుతున్నారు. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది.

**వైరస్ కలకలం..**
ఈ నౌక అర్జెంటీనా నుంచి బయలుదేరి అంటార్కిటికా, అట్లాంటిక్ ప్రాంతాల్లో ప్రత్యేక టూర్ కోసం ప్రయాణిస్తోంది. అయితే ప్రయాణం మధ్యలోనే అనుమానాస్పద వైరస్ లక్షణాలు కనిపించడంతో పరిస్థితి ఒక్కసారిగా విషమించింది. జ్వరం, శ్వాసకోశ సమస్యలు, బలహీనత వంటి లక్షణాలతో పలువురు బాధపడుతున్నారు. నౌకలో వైద్య సదుపాయాలు పరిమితంగా ఉండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది.

**తీరానికి అనుమతి నిరాకరణ..**
సహాయం కోసం కేప్ వెర్డే తీరాన్ని ఆశ్రయించినప్పటికీ, అక్కడి ప్రభుత్వం ప్రజారోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని నౌకను రేవులోకి అనుమతించలేదు. దీంతో ఈ నౌక ప్రస్తుతం అంతర్జాతీయ జలాల్లోనే నిలిచిపోయింది. ప్రయాణికులు, సిబ్బంది ఆహారం, మందులు, వైద్య సహాయం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**హంటావైరస్ అనుమానం..**
నౌకలో వ్యాపించిన వైరస్‌ను హంటావైరస్ గా అనుమానిస్తున్నారు. ఈ వైరస్ సాధారణంగా ఎలుకల ద్వారా వ్యాపిస్తుంది. కలుషిత ఆహారం, నీరు లేదా వాతావరణం ద్వారా మనుషులకు సోకే ప్రమాదం ఉంటుంది. కొన్నిసార్లు శ్వాసకోశ సమస్యలు తీవ్రమై ప్రాణాపాయం కలిగించవచ్చు. ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశంపై గతంలోనే హెచ్చరికలు జారీ చేసింది.

**నౌకలోకి వైరస్ ఎలా చేరింది?**
ఈ వైరస్ క్రూయిజ్ నౌకలోకి ఎలా ప్రవేశించిందన్నది ఇంకా మిస్టరీగానే ఉంది. నౌకలో ఆహార సరఫరా, నిల్వ విధానాలు, లేదా ఎలుకల సంచారం వల్ల వైరస్ వ్యాప్తి జరిగి ఉండవచ్చని నిపుణులు అనుమానిస్తున్నారు. దీనిపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టే అవకాశం ఉంది.

**అత్యవసర సహాయం కోసం ఎదురుచూపులు..**
ప్రస్తుతం నౌకలోని ప్రయాణికులకు అత్యవసర వైద్య సహాయం అవసరం ఉంది. అంతర్జాతీయ సముద్ర భద్రత సంస్థలు, వైద్య బృందాలు జోక్యం చేసుకుని సహాయం అందించే అవకాశాలు పరిశీలిస్తున్నారు. హెలికాప్టర్ల ద్వారా మందులు, ఆహారం పంపించే చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉంది.

**ప్రపంచవ్యాప్తంగా ఆందోళన..**
ఈ ఘటనతో అంతర్జాతీయ క్రూయిజ్ టూరిజంపై కూడా ప్రభావం పడే అవకాశముంది. కరోనా తర్వాత మళ్లీ ఇలాంటి వైరస్ వ్యాప్తి వార్తలు రావడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. ప్రయాణ భద్రత, ఆరోగ్య ప్రమాణాలపై మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్ భద్రతా అవగాహన సమావేశం,విద్యుత్ భద్రతా వారోత్సవాలు

**సబ్ ఇంజనీర్స్, ఏ ఈ ఏ డిఈ జమ్మికుంట రాజేందర్ డివిజనల్ ఇంజనీర్ ఎస్. లక్ష్మారెడ్డి**



**జమ్మికుంట, మే 05 ( హైదరాబాద్ పల్స్):**
జమ్మికుంట సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్ భద్రతా అవగాహన సమావేశం నిర్వహణ విద్యుత్ భద్రతా వారోత్సవాలు సందర్భంగా జమ్మికుంట సబ్‌డివిజన్ పరిధిలో ఓ అండ్ ఎం సిబ్బంది వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సమావేశం, జమ్మికుంటలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు భద్రతా నియమాలు, సరైన విధానాల గురించి విస్తృతంగా వివరించారు. ముఖ్యంగా లైన్ క్లియరెన్స్ ఎల్ సి పర్మిట్ టు వర్క్ పి టి డబ్ల్యూ వ్యక్తిగత రక్షణ పరికరాల పి పి ఈ వినియోగం, సరైన ఎర్తింగ్, ఫీడర్ ఐసోలేషన్ వంటి అంశాలపై ఓ అండ్ ఎం సిబ్బందికి సూచనలు ఇవ్వబడ్డాయి. అలాగే వినియోగదారులకు ఇంటి వైరింగ్ సురక్షితంగా ఉండేలా చూసుకోవడం, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకపోవడం, కిందకు వాలిన తీగలకు దగ్గరగా వెళ్లకపోవడం వంటి భద్రతా సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓ అండ్ ఎం వినియోగదారులు సబ్ ఇంజనీర్స్, ఏ ఈ ఏ డిఈ జమ్మికుంట రాజేందర్ డివిజనల్ ఇంజనీర్ శ్రీ ఎస్. లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

# మున్సిపల్ పరిధిలోని పలు వార్డులను సందర్శించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్



**జమ్మికుంట, మే 05 ( హైదరాబాద్ పల్స్):**
జమ్మికుంట పట్టణ పరిధిలో 30వార్డులకు సంబంధించిన శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్నవారిలో కొన్ని మార్పులు చేస్తూ అన్ని వార్డులకు గాను జవాన్లు సవరిస్తూ టీం వర్క్ చేస్తూ శానిటేషన్ విభాగంలో చేస్తున్నటువంటి టీమ్ వర్క్ పనులను 5,8,23 వార్డులను సందర్శించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణం ప్రజలకు అన్ని విధాలుగా మా పాలకవర్గం అందుబాటులో ఉంటామని, ప్రజలు తమ తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని ప్రజలు కూడా సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ కౌన్సిలర్స్ యట్ల సునీత అశోక్ కోలుగురి సురేష్ చింతల శ్రీనివాస్ శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కో ఆప్షన్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ, ఆలేరు మున్సిపాలిటీల్లో, ఎనిమిది మంది కో ఆప్షన్స్ సభ్యుల ఎన్నిక ప్రమాణస్వీకారం కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన యాదగిరిగుట్ట పట్టణంలో గౌలికార్ అరుణ, సయ్యద్ రహిమ, బండి జంగమ్మ,షరీఫ్,, ఎం ఎస్ విజయ్ కుమార్, చింతకింది మురళి, గుత్తా శమంతారెడ్డి, సిపిఎం కు చెందిన ఇంతియాజ్ ఇర్ఫానా కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఎన్నికైన వారికి ధ్రువపత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.